

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

- రూ.98 కోట్లతో వెలిగల్లు నుంచి పైప్‌లైన్ పనులు
- రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

ఫేస్‌టుఫేస్

రాయచోటిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న రాయచోటిలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతివీధిలో దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తున్నామని, పట్టణంలో నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు చెప్పారు.

ప్రశ్న: రాయచోటి మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగునకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిలిచిపోయిన వాహనాలకు రిపేర్లు చేయించి చెత్త సమస్య లేకుండా చూస్తున్నాం. ప్రతి వీధికి, చెత్త బండ్లు నడుస్తున్నాయి. ఆటోలు వెళ్లని వీధులకు పారిశుధ్య కార్మికులు తోపుడు బండ్లు తీసుకెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదు.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నివారణ కోసం ఏం చేస్తున్నారు ?

జవాబు: మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రాంతాల్లో దోమల నివారణ కోసం స్ప్రేయింగ్ చేస్తున్నాం. అలాగే అవసరమైన చోట ఫాగింగ్ కూడా చేస్తున్నాం. మలేరియా అధికారులతో కలిసి పట్టణంలో జ్వరాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖాధికారుల సహకారంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: వెలిగల్లు నీరు సక్రమంగా అందుతోందా..?

జవాబు: వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ప్రతిరోజూ 9 ఎంఎల్‌డీ నీటిని పట్టణ ప్రజలకు అందిస్తున్నాము. పైప్‌లైన్లు పాతవి కావడంతో ఎక్కడపడితే అక్కడ పైపులు పగిలిపోయి లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. ఫలితంగా ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కో విధంగా నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం రూ.98 కోట్లతో 17 ఎంఎల్‌డీ ప్లాన్‌తో కొత్తగా వెలిగల్లు ప్రాజెక్టు నుంచి పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ఆ పథకం పూర్తయితే పట్టణ శివారు ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

ప్రశ్న: పారిశుధ్య కార్మికుల సంఖ్య ఎందుకు పెరగడం లేదు?

జవాబు: ప్రస్తుతం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో సుమారు లక్షా 13 వేల మందికి పైగా జనాభా కలదు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు 167 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు కాకుండానే డైలీ వేజ్ కింద మరో 54 మందిని తీసుకున్నాము. పట్టణ ప్రజలకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

ప్రశ్న: పన్నుల వసూళ్లు ఏడాదికి టార్గెట్ ఎంత.. బకాయిలు ఎంత ఉన్నాయి?

జవాబు: మున్సిపాలిటీలో ఏడాదికి రూ.12 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఏడాదికి రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లు మాత్రమే వసూలవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల వారు పన్నులు కట్టడం లేదు. ప్రస్తుతం రూ.6 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ప్రతి ఏడాది మార్చి 31వ తేదీకి పన్నుల వసూళ్ల ఆర్థిక సంవత్సరాన్ని ముగిస్తున్నాం.

ప్రశ్న: ఇళ్ల నిర్మాణాలు, స్థలాల అప్రూవల్ జరుగుతున్నాయా ?

జవాబు: చాలామంది నిర్మాణదారులు ఇళ్ల అప్రూవల్‌కు, స్థలాల అప్రూవల్‌కు రావడం లేదు. బ్యాంకు లోన్లు, విక్రయాల సమయంలో తప్పనిసరిగా అప్రూవల్‌కు వస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చాలామంది మున్సిపల్ అనుమతులు, అప్రూవల్ లేకుండానే ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. దీనిపై మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి రాయచోటి పట్టణంతో పాటు పరిధిలోని మాసాపేట, కస్బా గొల్లపల్లి, రాయచోటిటౌన్ తదితర ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేని 12 లేఅవుట్లను నిలిపివేశాము.

పల్లెనూ.. వదల్లేదు...

- దర్జాగా ఆన్‌లైన్ చేసేశారు..
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- తవ్వేకొద్దీ.. బయటపడుతున్న పాపాలు
- వైసీపీ జమానాలో పరాకాష్ఠకు అవినీతి

వైసీపీ పాలనలో ఎక్కువగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఎదుర్కొన్న శాఖ రెవెన్యూ.. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఎన్నో సంఘటనలు మనకు కనిపిస్తాయి. అయితే ఇప్పుడు మనం చదవబోతున్న సంఘటన మాత్రం నభూతో.. నభవిష్యత్.. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులను ఎవరో ఒకరికి ఆన్‌లైన్ చేయడం చూశాం.. అయితే డబ్బు వేటలో బరి తెగించిన ఇద్దరు తహసీల్దార్లు తాము ఎంతో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్నామన్న సంగతి పక్కన పెట్టేసి.. సుమారు 50 సంవత్సరాలుగా ప్రజలు నివాసం ఉంటున్న పల్లెను ఓ వైసీపీ నాయకుడికి ఆన్‌లైన్ చేసేశారు. అవినీతి అక్రమాల చరిత్రలో తమకంటూ ఓ ప్రత్యేక పేజిని లిఖించుకున్నారు. అంతటి ఘనమైన ఆ తహసీల్దార్లు ఎవరో? పల్లెను ఆన్‌లైన్ చేయించుకున్న ఘనుడు ఎవరో ? తెలుసుకోవాలంటే.. ఈ కథనం చదవాల్సిందే..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెలో సర్వే నెంబరు 75/2లో 6.02 ఎకరాలు, సర్వే నెంబరు 129లో 15.75 ఎకరాలకు పైనే భూమి ఉంది. పై రెండు సర్వే నెంబర్లలో కలిసి సుమారు నాలుగు ఎకరాలలో 75 ఇళ్లు ఉన్నాయి. ఈ సర్వే నెంబర్లలో భూమిని వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సదిపిరాళ్ల రాంబాబురెడ్డి పేరు మీద ఇద్దరు తహసీల్దార్లు ఆన్‌లైన్ చేశారు. ఈ భూమి 1970 నుంచి తమ పెద్దలు అనుభవంలో ఉందని ఈ భూమి తమదే అనడానికి ఆధారాలు ఉన్నా అప్పటి తహసీల్దార్ అతడికి ఆన్‌లైన్ చేసినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. 75/2 సర్వే నెంబరులోని 6.02 ఎకరాలను ఆన్‌లైన్ చేశారు. ఇందులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఇళ్లు ఉన్నాయి. సదిపిరాళ్ల రాంబాబురెడ్డి పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలు, 1బి వంటి రికార్డులు ఉన్నాయి. ఇవన్నీ తప్పుడు రికార్డులతో రాంబాబురెడ్డి పొందాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి సర్వే నెంబరు 75/2 విషయమై వివాదం నడుస్తోంది. తొలుత ఈ వివాదం కడప జాయింట్ కలెక్టర్ కోర్టులో నడిచింది. అయితే వివాదాన్ని పట్టించుకోకుండా అప్పటి రామాపురం తహసీల్దార్ ఖాజాబీ రాంబాబురెడ్డి పేరు మీద మొత్తం 6.02 ఎకరాలను 28/6/2022న ఆన్‌లైన్ చేసింది. రెండు ఎకరాలలో పల్లె ఉందన్న విషయాన్ని పట్టించుకోకుండా ఆన్‌లైన్ చేయడానికి తహసీల్దార్ ధైర్యం చేసిందంటే ఆమెకు ఎంత ముట్టిందో? అని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వే నెంబరు 75/2 స్థలం వివాదంలో ఉందని రామాపురం రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకు అందరికీ తెలిసినా సరైన పత్రాలు లేకపోయినా రాంబాబురెడ్డి పేరు మీద ఆన్‌లైన్ అయిపోయింది. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న



సర్వే నెంబరు-129లో ఉన్న గ్రామం



గ్రామ - వార్డు సచివాలయము
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
GWSC 86803885
ఫారం-1 బి
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, రెవెన్యూశాఖ, భూమి రికార్డుల కంప్యూటరీకరణ

సర్వే నెంబరు 75/2ను రాంబాబురెడ్డి పేరు మీద ఆన్‌లైన్ చేసిన దృశ్యం

గ్రామస్థులు రాంబాబురెడ్డి పేరు మీద ఉన్న ఆన్‌లైన్ తొలగించమని ఆ తహసీల్దార్‌ను పలుమార్లు అడిగినా అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేసి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు. అయినా ఇప్పటి వరకు ఆ తహసీల్దార్ మీద ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఎందుకంటే అప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటమే కారణం. ఇంకా ఈ సమస్య పరిష్కరించుకోలేక.. ప్రజలు అల్లాడుతుంటే రెవెన్యూ అధికారులు చేసిన మరో బాగోతం బయటపడింది.

129 సర్వేలోనూ.. ఇదే వ్యవహారం

గ్రామంలోని మరో సర్వే నెంబరు-129లో 15.75 ఎకరాలకుపైగా భూమి ఉంది. ఇందులో సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 35కి పైగా ఇళ్లు ఉన్నాయి. ఇందులో ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ సర్వే నెంబరులోని 15 ఎకరాలను కూడా సదిపిరాళ్ల రాంబాబురెడ్డి పేరు మీద ఆన్‌లైన్ చేశారు. ఇక్కడ కూడా పల్లె ఉన్నా ఆన్‌లైన్ చేసేశారు. ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేసిన ఓ తహసీల్దార్ ఈ సర్వే నెంబరులో భూమిని ఆన్‌లైన్ చేసినట్లు సమాచారం.

డబ్బు కోసం ఏ గడ్డికరచడానికైనా సిద్ధం

ఎన్నికలకు ముందు జగనన్న సిద్ధం.. సిద్ధం అంటూ రాష్ట్రమంతా తిరిగాడు. అయితే అంతకుముందే ఆయన పాలనలో కొందరు తహసీల్దార్లు డబ్బు కోసం ఏ గడ్డి కరచడానికైనా సిద్ధపడ్డారని పలువురు పేర్కొంటున్నారు. సాధారణంగా భూములకు సంబంధించి ప్రభుత్వ రికార్డుల్లో నుంచి ఎవరి పేరైనా తీసేయాలన్నా? నమోదు చేయాలన్నా? కొన్ని నిబంధనలు పాటించాలి. ఎవరి పేరైనా తొలగించాలంటే రికార్డుల్లో ఉన్న వ్యక్తికి నోటీసులు ఇచ్చి సంజాయిషీ తీసుకుని ప్రభుత్వ పరంగా అన్ని నిబంధనలు పాటించి అతడి పేరు తొలగించాలి. అదే ఎవరి పేరైనా నమోదు చేయాలంటే అతను ఆ ఆస్తికి సంబంధించి సమర్పించే రికార్డులన్నీ పరిశీలించి నిబంధనలను అనుసరించి నమోదు చేయాలి. అయితే ఇక్కడ అటువంటి నిబంధనల పట్టింపు లేకుండా అన్నీ జరిగిపోయాయి. అధికారులు లంచాలు తీసుకుని రికార్డుల్లో పేర్లు తొలగించి నమోదు చేయడం వల్ల వివాదాలు ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పల్లెను ఆన్‌లైన్ చేసిన విషయం బయటపడి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కనీసం సంజాయిషీ కూడా అడగలేదు. దీంతో రెవెన్యూలో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి.

న్యాయం చేయాలంటూ...

వైసీపీ ప్రభుత్వ పాలనలో అక్రమార్కులకు అధికారులు వంత పాడారు. దీంతో బాధితుల గోడు పట్టించుకున్న వాళ్లే లేకుండాపోయారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితులు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు. సర్వే నెంబరు-129లో పల్లెను ఆన్‌లైన్ చేసిన విషయమై గురువారం గ్రామస్థులు రామాపురం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మూడు తరాలుగా తాము నివాసం ఉంటున్న పల్లెను వేరే వ్యక్తికి ఆన్‌లైన్ చేశారని, వెంటనే ఆ ఆన్‌లైన్‌ను తొలగించాలని సుమారు వంద మంది ప్రజలు తహసీల్దార్‌ను కోరారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తమకు న్యాయం చేయడంతో పాటు పల్లెను ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మేకల మందపై చిరుతపులి దాడి

- మేక మృతి



చిరుతపులి దాడిలో మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేకలమందపై చిరుతపులి దాడి చేసి ఒక మేకను చంపేసింది. స్థానికుల వివరాల మేరకు... మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసు వారిపల్లికి చెందిన రామయ్య గురువారం మేకలు తోలుకొని చిడతలగుట్ట వద్ద మేపుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే శుక్రవారం ఉదయం రామయ్య తన మేకల మందలోని ఒక మేక కనబడకపోవడంతో గ్రామస్తులతో కలసి చుట్టుపక్కల వెతికాడు. కొద్దిదూరంలో మేక అడవి జంతువుల దాడిలో చనిపోయినట్లు గుర్తించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా మదనపల్లి డీఆర్‌వో మధుసూదన్, తవళం బీట్ ఎఫ్‌బీవో దీప సంఘటనా స్థలానికి చేరుకొని మేకను చిరుతపులి చంపిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. సమీప గ్రామాల్లో చిరుతపులి సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా బోడికొండ అటవీ ప్రాంతంలో చిరుతపులి తిరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో చల్లావారిపల్లి ఆదెన్నకు చెందిన దూడ చిరుతపులి దాడితో మృత్యువాత పడగా, గౌనిగారిపల్లి శంకరకు చెందిన గొర్రెల మందపై దాడి చేసి రెండు గొర్రెలను గాయపరచింది. వారం రోజులు కాకుండానే చిరుతపులి మూగజీవాలపై దాడి చేసి చంపేస్తుండటంతో సమీప గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖాధికారులు చొరవ చూపి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

ఆటోనగర్ అటకెక్కింది..

- ఇరవై ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..
- ప్రభుత్వాలు మారుతున్నా సమస్య అలాగే..
- అడుగడుగునా కోర్టు కేసుల అడ్డంకులు
- వెంటనే పరిష్కరించాలని కోరుతున్న కార్మికులు

మదనపల్లెలో 'ఆటోనగర్' ఈ పేరు వింటే అటు మెకానిక్‌ల నుంచి ఇటు వాహన యజమానుల వరకు నిట్టూర్పులు వదులుతారు. 20 ఏళ్లుగా మదనపల్లెకు ఆటోనగర్ వస్తుందని, పట్టణ ప్రజలకు రణగొణ ధ్వనుల బాధ తప్పుతుందని ఆశ పడ్డ వేలాది మందికి ఆటోనగర్ అందని ద్రాక్షలాగే మిగిలిపోతోంది. సరిగ్గా నాలుగు ప్రభుత్వాలు ఐదేసి ఏళ్ల చొప్పున పాలించినా ఆటోనగర్ ఏర్పాటుకు అడ్డు తగులుతున్న కోర్టు కేసులను క్లియర్ చేయించిన దాఖలాలు లేవు. దీంతో ఆటోనగర్‌కు కేటాయించిన స్థలం నేడు చిట్టడవిని తలపిస్తోంది.



ఆరున్నరేళ్ల కిందట ఆటోనగర్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన వివరాల బోర్డు



మదనపల్లెటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో 2.50 లక్షల జనాభాకు 1.70 లక్షల ద్విచక్రవాహనాలు, 20 వేల దాకా కార్లు, జీపులు, 1000కి పైగా భారీ లారీలు, 1200 చిన్న లారీలు, 1500పైగా ఆటోలు తిరుగుతున్నాయి. వీటికి తోడు చుట్టుపక్కల పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి నిత్యం వందలాది వాహనాలు మరమ్మతుల కోసం మదనపల్లెకు వస్తుంటాయి. ఇలాంటి వాణిజ్య కేంద్రంలో వాహనాల మరమ్మతుల గ్యారేజిలు, లేత్‌లు, వెల్డింగ్ షాపులు, చిన్న పరిశ్రమలు, వాహనాలకు అవసరమైన స్పేర్ పార్ట్స్ విక్రయించే దుకాణాలు వెరసి అన్నింటిని ఒకేచోట ఏర్పాటు చేసేందుకు 2004 సంవత్సరంలో అప్పటి పాలకులు మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. స్థానిక పుంగనూరు రోడ్డులోని షిరిడీ సాయిబాబా ఆలయం కింది వైపున ఉన్న ప్రైవేటు స్థలంలో ఆటోనగర్ ఏర్పాటుకు ప్రయత్నాలు సాగించారు. అక్కడ స్థలాల విలువ ఎక్కువగా ఉండటంతో ఆటోనగర్ ఏర్పాటు అటకెక్కింది. 2009 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న షాజహాన్‌బాషా మదనపల్లె పట్టణ శివారులో ఆటోనగర్ ఏర్పాటు చేసేందుకు అడుగులు వేశారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ ములకలదిన్నె, బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో ఆటోనగర్‌కు భూసేకరణకు చర్యలు చేపట్టారు. ఎందుకో మళ్లీ ఈ ప్రయత్నాలు మందగించాయి. తరువాత 2014 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి రావడంతో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ములకలదిన్నె సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 17.5 ఎకరాల్లో ఆటోనగర్‌కు స్థలం కేటాయించారు. అక్కడ ఆటోనగర్‌తో పాటు ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేసేందుకు ప్లాట్లు డిజైన్ చేశారు. అంతేకాకుండా 2018 జనవరి 24వ తేదీ పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి చేతుల మీదుగా ఆటోనగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ క్రమంలో ఆటోనగర్‌లో స్థలాల కోసం మెకానిక్‌లు, లారీ బాడీ బిల్డర్లు, వెల్డర్లు, టింకర్లు, పెయింటర్లు వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇక్కడ ఆటోనగర్ వచ్చినట్టే వచ్చి దూరమైపోయింది.

అడుగడుగునా కోర్టు కేసుల అడ్డంకి

మదనపల్లె ఆటోనగర్‌కు కేటాయించిన స్థలం 17.5 ఎకరాల్లోకి ప్రవేశించేందుకు మదనపల్లె-పుంగనూరు జాతీయరహదారి నుంచి 60 అడుగుల వెడల్పుతో తారురోడ్డు నిర్మాణం మొదలు పెట్టారు. కానీ ఆటోనగర్ ప్రవేశ ద్వారంలో ఓ రైతుకు చెందిన భూమి ఉండటం, ఈ భూమికి పరిహారం ఇవ్వడంలో వివాదం లేవడంతో అది కోర్టుకు చేరింది. గతంలో కొందరు రైతులకు డీకేటీ భూములు ఇచ్చిన ప్రభుత్వం ఈ భూములు తిరిగి సేకరించడంలో అప్పటి అధికారులు నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆటోనగర్‌లో ప్రవేశించే దారి లేక, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆటోనగర్ ఏర్పాటు నిలిచిపోయింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే నవాజ్ బాషా, అప్పటి కలెక్టర్ గిరీషా ఆటోనగర్‌ను పలుమార్లు సందర్శించి ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్షలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ప్రస్తుత ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆటోనగర్‌పై ఏర్పాటుపై దృష్టి పెట్టి వేలాది మంది కార్మికులకు ఉపాధి చూపించాలని కోరుతున్నారు.

నాలుగు నెలల్లో సమస్య పరిష్కారానికి కృషి ..



మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటు చాలా ఏళ్లుగా ఉన్న ఆకాంక్ష. ఈ విషయమై ఆరు రోజుల క్రితం కలెక్టర్ శ్రీధర్‌తో కలసి ఆటోనగర్ స్థలాన్ని పరిశీలించాము. అంతే కాకుండా రాయచోటిలో నిర్వహించిన డీడీఆర్‌సీ సమావేశంలో కూడా ఆటోనగర్ ఏర్పాటు విషయం ప్రస్తావించాను. రైతులతో చర్చించి, కోర్టు కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. నాలుగు నెలల్లో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తాం.

- ఎం.షాజహాన్‌బాషా, ఎమ్మెల్యే

కోర్టు కేసులతో మధ్యలోనే నిలిచిపోయిన తారురోడ్డు నిర్మాణం



రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- రామానాయుని చెరువులో అక్రమ తవ్వకాలు



ఎక్స్‌కవేటర్‌తో మట్టి పొరలను తొలగిస్తున్న దృశ్యం

గుర్రంకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇసుక అక్రమ రవాణా కోసం చెరువును చెరబట్టి ఎక్స్‌కవేటర్‌తో మట్టి పొరలను తొలగించి కింద ఉన్న ఇసుకను ట్రాక్టర్లలో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుకాసురులకు నాయకుల అండ ఉండడంతో బయట మండలాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. మండలంలోని తరిగొండ పంచాయితీ పరిధిలో రామానాయుని చెరువు ఉంది. ఈ చెరువు వరుసగా మూడేళ్లు నీటితో నిండుకుండలా ఉంది. దీంతో ఇసుక తవ్వకాలు జరగలేదు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో చెరువులో నీరు లేక పూర్తిగా ఎండిపోయింది. ఈ ఇరిగేషన్ చెరువులో మట్టి పొరలను రెండు అడుగుల మేర తొలగిస్తే లోపల ఇసుక ఉంది. దీంతో ఇసుకాసురులు గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువులో ఎక్స్‌కవేటర్లను ఉంచి పగలు రాత్రి అన్న తేడా లేకుండా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తవ్వకాలపై కొందరు నాయకులు, రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చెరువు వద్దకు వెళ్లే సరికే అక్రమార్కులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది.

వాహనాలు సీజ్ చేస్తాం

- మదురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

తరిగొండ రామానాయునిచెరువులో అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అలాగే ఇసుక తవ్వకాల కోసం యంత్రాలను ఉపయోగిస్తే వాటిని సీజ్ చేస్తాం. స్థానికుల అవసరాలకు మాత్రమే ఇసుకను తరలించాలి. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకొంటాం.

గణతంత్ర దినోత్సవ శిబిరానికి పీలేరు విద్యార్థి ఎంపిక



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సన్నాహక శిబిరానికి ఎన్‌సీసీ క్యాడెట్ బాలాజీ ఎంపికయ్యాడు. స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ 17 నుంచి 26వ తేదీ వరకు సికింద్రాబాదులో జరగనున్న సన్నాహక శిబిరంలో శిక్షణ తీసుకుంటాడని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రైతు

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులు ఆంజనేయులు, పాపిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం బండార్లపల్లెకు చెందిన ఆంజనేయులు, కురబలకోట మండలం ముదివేడు వాసి పాపిరెడ్డి కర్ణాటక రాష్ట్రం చింతామణిలో కూరగాయల విత్తనాలు కొనుక్కు, రావడానికి బైక్‌లో బయలుదేరారు. బురకాయల కోట వద్ద బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులిద్దరూ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హక్కుల కోసమే పోరాటం

మదనపల్లె అర్బన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బీసీ హక్కుల పోరాట సమితి పోరాటం ప్రజల కోసమేగాని పదవుల కోసం కాదని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యసభ సీట్లలో బీసీలకే మొదటి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవా ధ్యక్షుడు రామలింగ, రాయలసీమ ఆర్గనైజర్ కార్యదర్శి వెంకటేశ్వరయాదవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు పోతబోలు వెంకటరమణ, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి యువరాజ్ నాయక్ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవతానగర్ వాసి అన్నయ్యనాయక్ కుమారుడు యువరాజ్ నాయక్ ఇంటర్ చదువుతున్నాడు. బైక్ కొనాలనడంతో అమ్మ మందలించిందని మనుస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. తాలుకా సీఐ కేసు నమోదు చేశారు.

రైతులకు ఆదర్శం శంకర్‌రెడ్డి వ్యవసాయం

● ఉష్ణప్రాంతంలోనూ ఆపిల్ పండించిన కృషి
● నూతన పంటల సాగు..అధిక దిగుబడులు
● పక్క రాష్ట్రాలకూ పాకిన వైనం



సాధించిన అవార్డులతో రైతు శంకర్‌రెడ్డి



రూ. 40 లక్షలతో రైతు శంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన పాలీ హౌస్



వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదమంటున్న తరుణంలో పలువురు రైతులకు రైతు శివశంకర్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డి 15 ఎకరాల పొలంలో తరతరాలుగా వస్తున్న వ్యవసాయాన్ని అందిపుచ్చుకుని వేలాది మంది రైతులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. 20 ఏళ్ల కిందట తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో వేరుశనగ, చెరకు, కూరగాయలు, తదితర పంటలను తనదైన శైలిలో సాగు చేసి అధిక దిగుబడులు రాబడ్డటం, తర్వాత అంచెలంచెలుగా తన మేధోశక్తితో వ్యవసాయాన్ని అభివృద్ధి బాట పట్టించాడు. శీతల ప్రదేశాల్లో పండే ఆపిల్ పంటను సైతం సకాలంలో పండించి శభాష్ అనిపించు కుంటున్నారు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తెచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలను నాటి కంటికి రెప్పలా కాపాడాడు. అంతే ఏడాదికి ఆపిల్ కాయలు విరగ్గాశాయి. ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. బీడు భూములను వ్యవసాయ భూములుగా మారుస్తూ రైతులకు సైతం ఎన్నో మెలుకువలు నేర్పిన ఘనత శివశంకర్ రెడ్డికి దక్కుతుంది. కేవలం సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారాయన. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డికి 15 ఎకరాల పొలం ఉంది. 2007లో మూడెకరాల్లో కదిరి రకం వేరుశనగ పంట సాగు చేసి అధిక దిగుబడులు రాబట్టాడు. చుట్టుపక్కల గ్రామీణ రైతులు సైతం అప్పట్లోనే ఆశ్చర్యపోతూ శివశంకర్ రెడ్డిని అభినందించడం గమనార్హం. ఇక అప్పటి నుంచి వ్యవసాయమే జీవనాధారంగా రైతు శివశంకర్‌రెడ్డి కుటుంబం శ్రమించ సాగింది. నష్టాలు చవిచూసినా అధైర్య పడక చెరకు, వేరుశనగ, చాందినీపూలు, చామంతి, లిల్లీ (తెలుపు, పసుపు), తదితర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు రావడంతో వెను దిగిరి చూసుకోకుండా పరిశోధనాత్మకంగా అనేక రకాల పంటలను సాగు చేయడానికి సిద్ధం చేసుకోవడం గమనార్హం. తన వ్యవసాయ క్షేత్రంలో నాలుగేళ్ల కిందట సాగు చేసిన ఆలీవ్ మొక్కలు ఏపుగా పెరిగి మరో ఏడాదిలో పంట రానుంది. గతేడాది హరిమాన్ 99 రకం యాపిల్ మొక్కలను అధిక పెట్టుబడులతో ప్రయోగాత్మకంగా చేసిన మొక్కలు ఏపుగా పెరిగి యాపిల్ కాయలు విరగ్గాశాయి. దీంతో తిరిగి అదే రకం యాపిల్ మొక్కలను సాగు చేశాడు. దేశంలో అరుదైన మకడమియా డ్రై ఫ్రూట్ పంటను పరిశోధనాత్మకంగా మొదలు పెట్టి సాగు చేయడానికి ముందడుగులు వేస్తున్నారు. ఆ రకం డ్రైఫ్రూట్ కిలో రూ.2వేలకు పైగా పలుకుతుండడం గమనార్హం. చామంతి మొక్కల్లో ఐదురకాలు పెంపకానికి రంగం సిద్ధం చేస్తున్నాడు. అయ్యవారిపల్లె మొదలుకుని రాష్ట్రాలు దాటి వేలాదిమంది రైతు కుటుంబాలకు ఆదర్శంగా నిలిచాడు. నర్సరీల్లో సైతం శివశంకర్‌రెడ్డి వంగడాలు, పూల రకం మొక్కలు తదితరాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా పశువుల ఎరువు, సూక్ష్మపోషక ఎరువుల వాడకంతో పంటల నుంచి అధిక దిగుబడులు రాబట్టవచ్చని చెబుతున్నారు. ఈయన వ్యవసాయ క్షేత్రంలో సుమారు రూ.40లక్షల పెట్టుబడితో ఓ పాలీహౌస్, రూ.7లక్షలతో ఒకటిన్నర ఎకరాలో షైడ్‌నెట్ నర్సరీ నిర్వహిస్తున్నారు. ప్రతి రైతు తన మోధో శక్తితో వ్యవసాయం కుంటుపడకుండా ముందుకెళ్లాలని, తనను కలిసే ప్రతి రైతుకు ఎప్పటికప్పుడు వ్యవసాయ మెలకువలు నేర్పుతున్నానంటున్నారు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వం సబ్సిడీలతో సరిపెట్టుకోకుండా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా రైతాంగానికి చేయూత నిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ వ్యాప్తంగా మన రాష్ట్రానికి వ్యవసాయ రంగంలో ఎంతో ముందుందని చెప్పడంలో సందేహం లేదు. ప్రభుత్వాలు మారినా రైతుల స్థితిగతులు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా ఉచితాల పంపిణీ కంటే ముందుగా రైతుల అవసరాలను గుర్తించి మేలు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతుకు అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటే హర్షించదగ్గ విషయమే.

- శివశంకర్‌రెడ్డి, ఆదర్శ రైతు, అయ్యవారిపల్లె, వాల్మీకిపురం

శంకర్‌రెడ్డిని వరించిన అవార్డులు..

2007లో రైతు శివశంకర్‌రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. 2009లో ఆలిండియా రేడియో ఉత్తమ వ్యాఖ్యాతగా అవార్డు, 2014, 2019లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పూల సాగు రైతుగాను, ఇలా ఎన్నో పురస్కారాలు సొంతం చేసుకున్నారు. ఐదు నెలలుగా విదేశీ శాస్త్రవేత్తల బృందం శివ శంకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రశంసించడం గమనార్హం.

ఉష్ణప్రాంతంలో విరగ్గాసిన ఆపిల్

కశ్మీర్.. సిమ్లా... పంటను ఉష్ణ ప్రాంతాల్లో ఆపిల్ పంటను సేంద్రీయ పద్ధతిలో సాగుచేశారు. కేవలం శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే ఆపిల్ కరవుప్రాంతంలో విరగ్గాశాయంటే అది రైతు శివశంకర్‌రెడ్డి కృషిగానే చెప్పవచ్చు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలు కంటికి రెప్పలా కాపాడాడు. తాను పెంచిన మొక్కలకు ఎలాంటి చీడ, పీడలు కూడా కలగలేదని, కేవలం మొక్కలు పెరగడానికి మాత్రమే నీటిని పెట్టామన్నారు. శీతల ప్రాంతాల్లో లాగే మార్చి నెలలో పూతతో మొదలై ఆగస్టులో పంట పండ్లు కాయడం విశేషమని చెబుతున్నారు. 5 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత్తలుండే ప్రాంతంలో పండించే ఆపిల్ పంట 45 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వేడి ఉన్నా పంట సాగుకు ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్త లు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించని ఆపిల్ పంట భవిష్యత్తు తరాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఆపిల్ కాయలు విరగ్గాయడంతో ఇటీవల 300 ఆపిల్ పండ్లు తన కుటుంబ సభ్యులు, కూలీలకు పంచిపెట్టాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఆపిల్ ధర రూ.150 నుంచి 200 పలుకుతుండగా మన ప్రాంతాల్లో మాత్రం రైతులు ఆసక్తి చూపకపోవడం బాధాకరం. అయితే మన ప్రాంతంలో కూడా పంట సాగు చేయవచ్చని రైతు చెబుతున్నాడు.



శివశంకర్‌రెడ్డి సాగు చేసిన హరిమాన్ రకం యాపిల్ (ఫైల్‌ఫొటో)

జింకల గుంపు రాకతో అదుపుతప్పిన బైక్

దంపతులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుకన్య

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జింకల గుంపు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి భార్యభర్తలు గంగులప్ప, సుకన్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మద్దినాయనిపల్లె పంచాయతీ నాయనివారిపల్లె వాసి గంగులప్ప భార్యతో కలిసి సొంత పనుల నిమిత్తం బైక్‌లో ములకల చెరువుకు వచ్చారు. పనిముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ములకల చెరువు వద్ద జింకల గుంపు అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ రేషన్ పట్టివేత

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు



తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాధవరం-1 శివారు షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌బియ్యం గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని చుట్టుపక్కల పొలాల్లో రైతులను విచారించగా జంగాలపల్లె వాసి రాజు అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. దాదాపు 300పైగా రేషన్ బియ్యం బస్తాలను ఒంటిమిట్ట సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వ్యవసాయాధికారి గంగాధర్, ఏఈఈ అశోక్‌కుమార్, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, నవంబర్ 8:(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి విక్కీ, మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

'హైందవ శంఖారావం' కరపత్రాలు ఆవిష్కరణ

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 2025న హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. సొసైటీ కాలనీలోని రామాలయంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయడానికి విశ్వహిందూ పరిషత్, హిందూచైతన్య వేదిక, సమరత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. వేణుగోపాల్‌నాయుడు, భానుప్రకాష్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

12 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం ● ఎనిమిది మంది పరార్ : ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి



పట్టుబడిన నిందితుడితో ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం బీట్ భద్రికోన అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని, 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామని సిద్దవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ అందిన సమాచారంపై కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాలపై సిబ్బందితో గురువారం రాత్రి భద్రికోన అటవీ ప్రాంతంలో తనిఖీ చేశామన్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు దుంగలను లోడు చేస్తుండగా సిబ్బందిని చూసి పరారయ్యారన్నారు. వారిని వెంబడించి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభ్యమైన 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. స్మగ్లర్‌ను విచారించగా నెల్లూరు జిల్లా కలువాయి మండలం తిరుమలపాడు వాసి వెంకటేశ్‌గా తెలిపాడన్నారు. బెంగుళూరు వాసి హయాజ్ కారు, 8 మంది కూలీలను అప్ప జెప్పి ఎర్రచందనం దుంగలను తీసుకురావాలన్నాడని అంగీకరించాడు. పరారైన 8 మంది కూలీల కోసం అటవీ సిబ్బంది గాలిస్తున్నామన్నారు. దుంగల బరువు 274 కిలోలు ఉండగా రూ.76120 విలువైనవన్నారు. కేసు నమోదు చేసి వెంకటేశ్‌ను తిరుపతి కోర్టుకు హాజరు పరుస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ భూములు స్వాధీనం



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఈఓ, ఎస్ఐ

రామసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కురిజల గ్రామం పురాతన చెన్నకేశవ స్వామి ఆలయం వివాదాస్పద భూములను స్వాధీనం చేసుకున్నట్లు దేవదాయ శాఖ ఈఓ రమణ తెలిపారు. సర్వే నెంబర్లు 52/14లో 1.60 సెంట్లు, 57/25లో 22 సెంట్లు, 52/10లో 18 సెంట్లు, 41/4లో 8 సెంట్లు, 52/3లో 7 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకున్నామని, త్వరలో లీజువేలం నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు ఈఓ తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య సమక్షంలో పంచనామా చేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, ఏఎస్ఐ హిమాచలపతి, రెవెన్యూ సిబ్బంది, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, దొడ్డిపల్లె ఆనంద, మాజీ జడ్పీటీసీ శివశంకర్, రాజేశ్, మాలమహానాడు అధ్యక్షుడు క్రిష్ణప్ప, చెంగారెడ్డి, నాగరాజ, భూలక్ష్మి, శంకర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

● శిక్షణ తరగతుల్లో అబ్జర్వర్ ప్రసాద్



శిబిరంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ప్రసాద్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ఎంపీడీఓల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలని అబ్జర్వర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 18 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, ఇద్దరేసి పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమ అబ్జర్వర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే ఈ తరగతుల్లో 2025-26 వార్షిక సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే వచ్చే ఆర్థిక సంవత్సరం నిధులు మంజూరవుతాయన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీఎల్‌పీఓ లక్ష్మీపతి, రిసోర్స్ పర్సన్ దిలీప్‌కుమార్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో నేటి నుంచి సవరణలు

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో సవరణల కోసం పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలను ఈనెల 9, 10, 23, 24 (శని, ఆదివారాలు) తెరిచి ఉంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యా శాఖకు ఆదేశాలు జారీ చేస్తూ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో ఓటర్ల సవరణ దరఖాస్తులు స్వీకరించేందుకు అనువుగా పాఠశాలల గేట్లు తెరిచి ఉంచాలని తహసీల్దార్లు ఎంఈఓలను కోరారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల ఆవరణల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారన్నారు. జనవరి 1కి అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తహసీల్దారు నవీన్ తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై పోలీసుల దాడులు

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీకల బైలు గ్రామం బెంగళూరు రోడ్డులోని బార్లపల్లె వద్ద గుట్ట లో కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. కోడిపందెం ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, 8 బైకులు, రూ. 35,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలి పారు.

గుంటూరు వాసి అశోక్‌రెడ్డి మదనపల్లెలో అదృశ్యం



మదనపల్లె అర్బన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అప్పు వసూళ్ల కోసం మదనపల్లెకు వచ్చిన గుంటూరు వాసి అశోక్ రెడ్డి అదృశ్యమయ్యాడని టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గుంటూరుకు చెందిన ఎర్రం అశోక్‌రెడ్డి మదనపల్లె మండలం, అవకిశెట్టిపల్లెకు చెందిన కిషోర్‌రెడ్డికి సుమారు రూ. 56 లక్షలు అప్పు ఇచ్చాడు. ఇచ్చిన అప్పు ను వసూళ్ల కోసం ఈ నెల 5వతేదీన భార్య శ్యామలతో కలిసి మదనపల్లెకు వచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ లాడ్జీలో భార్యను ఉంచి అప్పు వసూలుకు చిత్తూరు బస్టాండ్‌కు వెళ్లాడు. దీంతో 6వ తేదీ నుంచి కనపడకుండా పోయాడంటూ భార్య శ్యామల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసు సాక్షిగా... బహిరంగ మద్యపానం



అక్కడ పోలీసు ఉన్నాడు... మద్యం దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు వివరిస్తున్నాడు. ఆ పక్కనే ఉన్న చిల్లర కొట్టు వద్ద ఓ వ్యక్తి తాపీగా మద్యం తాగుతున్నాడు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు పెట్టి జరిమానా విధిస్తున్న పోలీసులు వారి ముందే షాపు వద్ద మద్యం తాగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇది శుక్రవారం ఉదయం 11.15 గంటలకు స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపం పక్కన రింగ్ రోడ్డులో ఉన్న యుగంధర్ వైన్స్ వద్ద జరిగింది.

- మదనపల్లె టౌన్,(ఆంధ్రజ్యోతి)

స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్ రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి మృతి



ప్రమాద స్థలంలో రామచంద్రారెడ్డి మృతదేహం, రామచంద్రారెడ్డి (ఫైల్)



ఎర్రగుంట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ విద్యుత్ లైన్‌మాన్ గుత్తి రామచంద్రారెడ్డి(72) మృతి చెందాడు. ఎర్రగుంట్ల నగరపంచాయతీ న్యూకాలనీలో నివాసం ఉంటున్న రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు బయలు దేరాడు. నాలుగు రోడ్ల కూడలిలోని ఆర్‌ఓబి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో టిప్పర్ కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌బాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా, ఏరువాక గంగమ్మ ఆలయ కమిటీ ట్రెజరర్‌గా ఉన్న రామచంద్రారెడ్డి మృతి పట్ల కమిటీ దిగ్ర్భాంతిని వ్యక్తం చేసింది. ఎర్రగుంట్ల మండల ఎన్డీయే ఇన్‌చార్జి మధు సూదన్‌రెడ్డి సంతాపం తెలిపారు.

70 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



ప్రొద్దుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని వాసవీ ట్రాన్స్ పోర్టు పక్కన ఓ గదిలో 70 రేషన్ బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. శుక్ర వారం తహసీల్దారు గంగయ్య డీటీ సాయినాథరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జునలు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఉన్నట్లు గుర్తించిన గది షెట్టర్ తాళాలు పగలగొట్టి.. అందులో వున్న రేషన్ బియ్యం బస్తా లను స్వాధీనం చేసుకున్నారు. 70, 50 కేజీల బస్తాలు మొత్తం 3500 కేజీలు ఉంటాయని అంచనా వేశారు. బియ్యంతో పాటు 15 కేజీల కంది బేడలు, 7కేజీల చెక్కర కూడా వున్నట్లు తెలిపారు. ఈ గదిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఎవ్వరు పెట్టారనేది అధికారులు తేల్చ లేకపోయారు. దీంతో కేసు నమోదు చేయకుండానే వీటిని స్వాధీనం చేసుకున్నారు. బొల్లవరంలో ఒక అద్దె గదిలో 14 రేషన్ బియ్యం బస్తాలను సురేంద్ర అనే వ్యక్తి అక్ర మంగా నిల్వ చేయడం గుర్తించి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్ర హరిత, నందిని

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థినులు విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. హాస్టల్ గేటు వద్ద అపస్మారకస్థితిలో పడిపోయిన వీరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలిలా.. ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటున్న ఆర్.చంద్రహరిత, సి.నందిని జమ్మలమడుగు పట్టణంలోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు స్నేహితులు. కాగా... గురువారం రాత్రి 9.30గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటికి వెళ్లారు. తిరిగి హాస్టల్‌కు వస్తుండగా ఏం జరిగిందో ఏమో కానీ ఉన్నట్లుండి హాస్టల్ గేటు వద్ద పడిపోయారు. వెంటనే హాస్టల్ వార్డెన్ అక్కడున్న వర్కర్ విషద్రావణం తాగినట్లు గుర్తించి.. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఆర్.చంద్రహరితను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, సి.నందినిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలిసిన అర్బన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది వసతి గృహం వద్దకు చేరుకొని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా ఆమె దాటవేశారు.

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత లింగమూర్తి మృతి



కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, రాయలసీమ రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లింగమూర్తి (84) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోనే కాక రాయలసీమ ప్రాంతంలో గుర్తింపు ఉన్న నేత లింగమూర్తి అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అనేక దఫాలుగా పోరాటాలు చేస్తూ రైతాంగాన్ని మేల్కొలిపిన నేత లింగమూర్తి అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కమిటీ సభ్యుడిగా, రాయలసీమ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారని తెలిపారు.

గురుకుల పాఠశాలలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తనిఖీ


ప్రొద్దుటూరు ఆసుపత్రిలో విద్యార్థిని వర్షిణిని పరామర్శిస్తున్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ

కొండాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గురుకుల పాఠశాలను శక్రవారం సాయింత్రం గురుకుల పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులు పాము కాటుకు గురైన నేపథ్యంలో తాడేపల్లె నుంచి వచ్చిన ఆయన పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వారంలోపు పూర్తిగా శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అదేవిధంగా భోజనశాల, బాత్ రూంలు కూడా శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వర్షిణి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. కాగా ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు కోలుకుంటున్నట్లు ప్రిన్సిపల్ క్రిష్ణవేణి వివరించారు.

మీకు సగం... మాకు సగం

- ఆక్రమణలలో ఐక్యత చాటుతున్న ఇరుపార్టీల కబ్జాదారులు
- వాటాలు పంచుకునేందుకు ఎత్తుగడ
- మళ్లీ చేతివాటం ప్రదర్శిస్తున్న నకిలీ పట్టారాయుళ్లు
- బద్వేలులో భూ దందాలకు తెరపడేనా..



బద్వేలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు అడ్డా బద్వేలు నియోజకవర్గం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు ఎక్కడ కనబడితే అక్కడ గద్దల్లా వాలిపోయి కబ్జాలకు పాల్పడేవారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో పెద్ద ఎత్తున భూములు వైసీపీ నేతల కబంధ హస్తాలలో చిక్కుకున్నాయి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూలిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆపార్టీకి చెందిన కొందరు కబ్జారాయుళ్లు వైసీపీ అక్రమార్కుల కంటే తామేమీ తీసిపోమ్మన్నట్లు భూ ఆక్రమణలకు తెరలేపారు. అయితే ఇప్పటికే వైసీపీ వారు కనిపించిన ప్రభుత్వ భూములన్నింటిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. దీంతో చేసేది లేక కూటమి నాయకులు వైసీపీ ఆక్రమణదారులతో చేయి కలిపారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కబ్జా చేసిన భూములు, ఇతర స్థలాలకు మేం రక్షణ కల్పిస్తాం, అవసరమైన మేరకు అమ్మేసి ఇద్దరం కలిసి సొమ్ము చేసుకుందామంటూ పన్నాగం పన్నారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో కబ్జాల పర్వం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరు పార్టీల కబ్జారాయుళ్ల కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలపై కన్నేసి వచ్చే ఆదాయంలోమీకు సగం, మాకు సగం అన్నట్లు వాటాలు పంచుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

వాటాలు పంచుకునేందుకు...

రోజురోజుకు విస్తరిస్తున్న బద్వేలు పట్టణం దాని పక్కనే ఉన్న గోపవరం మండల ప్రాంతాలలో భూములు, ఇళ్ల స్థలాలకు బాగా డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములు, స్థలాలను అమ్మిసొమ్ము చేసుకున్న మొత్తంలో వాటాలు పంచుకునేం దుకు ఇరు పార్టీల నాయకులు ఎత్తుగడ వేశారు. ఇటీవల బద్వేలు పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఓ ప్లాటు విషయంలో ఇరుపార్టీల కబ్జాదారులు కలిసి అమ్మిన మొత్తంలో అక్కడ పరిస్థితిని, దాని విలువను బట్టి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. గోపవరం మండలంలోని నెల్లూరు రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఇరు పార్టీల నేతలు కలిసి దాదాపు 40 ఎకరాల వరకు ఆక్రమించి వారి ఆధీనంలో ఉంచుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బద్వేలు పరిసర ప్రాంతాలలో ఉన్న కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా 116, 26 సర్వేనెంబర్లలో భారీ స్థాయిలో భూ ఆక్రమణలు జరిగినట్లు సమాచారం. సి.కొత్తపల్లెలో ఒకటి నుంచి 90 సర్వే నెంబర్లలో కూడా భారీ స్థాయిలో భూఆక్రమణలు చోటు చేసుకున్నాయి.

అవే పంచాయితీలు

బద్వేలులో రెవెన్యూ అధికారులు, పోలీసుల వద్ద భూ ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన పంచాయతీలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ రికార్డు కావడం లేదు. ఏదోరకంగా వాటాలు కుదుర్చుకోవడంతో సర్దుబాటు అవుతున్నాయని చెప్పవచ్చు. మరికొన్ని వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ ఇలాంటి నాలుగైదు పంచాయితీలు, వివాదాలు ఉంటున్నాయంటే బద్వేలులో ఇరు పార్టీలకు చెందిన కబ్జారాయుళ్ల చేస్తున్న దందాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించవచ్చు.

నకిలీ పట్టారాయుళ్లకు హెచ్చరికలు

బద్వేలు భూ వివాదాలకు ప్రధాన కారణమైన నకిలీ పట్టాల సృష్టికర్తలపై పోలీసులు దృష్టి పెట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి పట్టుబడ్డవారిని గత ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలిపించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో బద్వేలులో కబ్జాలు, ఆక్రమణల పర్వానికి కొంతకాలం బ్రేక్ వేసి.. స్తబ్దుగా ఉన్న వీరు మళ్లీ ఇటీవల ఇలాంటి కార్యకలాపాలకు దిగుతున్నట్లు సమాచారం. పోలీసులు ఇరు పార్టీలకు చెందిన ఆక్రమణదారులపై దృష్టి పెట్టకపోతే బద్వేలులో మళ్లీ ఆక్రమణల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హయ్యర్ పెన్షన్ చెల్లింపు ప్రక్రియలో అనిశ్చితి సరిచేయండి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు



పీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు సజావుగా సాగుతున్న హయ్యర్ పెన్షన్ చెల్లింపు విధానంలో నెలకొన్న తీవ్ర గందరగోళ అనిశ్చితిని త్వరితగతిన సరిచేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, వై.రవీంద్రనాథ్‌వర్మ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా హయ్యర్ పెన్షన్ చెల్లింపు విధానాన్ని నిలుపుదల చేయడం విడ్డూరంగా వుందన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కడప రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 2022 నవంబర్ 4న వెలువడిన సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 2014 తర్వాత పదవీ విరమణ పొందిన వారికి హయ్యర్ పెన్షన్ కొర కు దరఖాస్తు చేసుకునేందుకు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఆ మేరకు చాలా మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వారి స్థాయిని బట్టి, వారికి వచ్చిన డిమాండ్ నోటీసుల ప్రకారంగా వారి వద్ద డబ్బులు లేకున్నా ఎక్కువ పెన్షన్ వస్తుందనే ఆశతో అప్పులు తెచ్చి ఒకటిన్నర లక్షల రూపాయల నుంచి సుమారు 11 లక్షల రూపాయల వరకు డీడీలు తీసి పంపించారన్నారు. గత ఏప్రిల్ నెలలో డబ్బులు కట్టిన వారికి కూడా ఇంతవరకు హయ్యర్ పెన్షన్ రాలేదన్నారు. ఈ విషయంగా సంబంధిత పీఎఫ్ కార్యాలయ ఉద్యోగులను విచారించగా వారు కూడా తమకేమీ తెలియదని సమాధానం చెప్పారన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు హయ్యర్ పెన్షన్ ప్రక్రియను నిలుపుదల చేయాలని సూచించినట్లు వెల్లడించారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాలక ప్రభుత్వాలు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి పి.సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మాన్‌పై 'విజిలెన్స్' రహస్య విచారణ



విచారణ అనంతరం విషయాలు ల్యాప్‌టాప్‌లో రికార్డు చేస్తున్న అధికారులు

దువ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని విద్యుత్తు శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన బి.నాయబ్‌రసూల్‌పై ఆశాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం రహస్య విచారణ చేపట్టారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి లైన్ మాన్ దురాగతాలను అడిగి తెలుసుకున్నారు. అక్టోబరు 23వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సదరు ఉద్యోగి చేస్తున్న అవినీతి అక్రమాలపై 'ఐతే నాకేంటి' శీర్షికన కథనం ప్రచురణ అయిన విషయం విధితమే. ఇందుకుస్పందించిన విద్యుత్తు శాఖ వెంటనే నాయబ్‌రసూల్‌ను మైదుకూరుకు బదిలీచేసింది. శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎటువంటి సమాచారం రైతులకు ఇవ్వకుండా వచ్చి రహస్యంగా విచారణ గావించారు. కొంత మంది బాధిత రైతులకు విషయం తెలిసి విచారణ అధికారుల వద్ద తమను ఏ విధంగా సదరు ఉద్యోగి పీడించి లంచాలు తీసుకున్నాడో వాగ్మూలం ఇచ్చారు. రైతులు చెప్పిన విషయాలను విచారణ అధికారులు రికార్డు చేసుకున్నారు. ప్రముఖ దినపత్రికలో విలేకరిగా పనిచేసిన వ్యక్తి మృతి అనంతరం అతని భార్య పొలానికి రెండు కరెంటు స్తంభాలు, వైరు అవసరం పడగా రూ.10 వేలు లంచం ఇచ్చేంతవరకు నాయబ్‌రసూల్ విద్యుత్తు సమస్య పరిష్కరించలేదని బాధిత మహిళా రైతు బంధువు విచారణ అధికారుల ఎదుట వాపోయారు. సామాన్య రైతులను ఇతను తొమ్మిదేళ్లుగా లంచాల రూపంలో పీల్చుకు తిన్నాడని వాపోయారు. బహిరంగ విచారణ చేస్తే పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొంటారని చెప్పారు. దీనికి విచారణ అధికారులు నిరాకరించారు. విచారణలో విజిలెన్స్ సీఐ, ఎస్ఐ, మరో ఇద్దరు అధికారులు పాల్గొన్నారు. ఈ విషయమై సదరు అధికారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విషయాలు వెల్లడించడానికి వారు నిరాకరించారు.

ఫసల్‌బీమాపై రైతులకు అవగాహన కల్పించండి


రైతుసేవా సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు

పులివెందుల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతుసేవా కేంద్రం సహాయకులు రైతులకు అవగాహన కల్పించి.. సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాక అధికారి నాగేశ్వర్‌రావు సూచిం చారు. పులివెందుల పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పులివెందుల వ్యవసాయ డివిజను పరిధిలోని రైతుసేవా కేంద్రం సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రబీ పంటలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుకు గుర్తించామన్నారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ, శెనగ, నువ్వులు, పెసలు, జొన్న, ప్రొద్దుతిరుగుడు పంటలకు డిసెంబరు 15లోపు బీమా చేయించుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టరు రమణారెడ్డి, పులివెందుల వ్యవసాయ సబ్ డివిజ ను వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేయాలన్నారు. కాగా గత సీజన్‌లో బాగా పనిచేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రమేశ్, నాగలక్ష్మి, చెన్నరెడ్డి, నవంత్‌బాబు, రాజేంద్రప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ నవంబర్ 8. (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ మెన్ అండర్-14 రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లు శుక్రవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా...

కేఓఆర్‌ఎం మైదానంలో క్రిష్ణా-విజయనగరం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 85.2 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో శ్రీకాకుళం- నెల్లూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్లకు 447 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసింది. ఇందులో సాయియశ్వంత్ 100 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 65.4 ఓవర్లలో 179 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కాగా బౌలింగ్ విభాగంలో సుహాన్ 5 వికెట్లు పడగొట్టాడు. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన గుంటూరు జట్టు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

నేటి నుంచి 68వ రాష్ట్రస్థాయి రగ్బీ స్కూలు గేమ్స్

కమలాపురంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురం పట్టణంలో డిగ్రీకళాశాలలో శనివారంనుంచి 68వ రగ్బీ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల వసతులను మెరుగుపరచాలి - జడ్పీసీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీసీఈవో ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యను అభ్యసించే విద్యార్థుల అన్ని అవసరాలను, వసతులను గుర్తించి వాటిని మెరుగుపరచాలని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సి.ఓబుళమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఎంపీడీవో కార్యాలయంతో పాటు అదే ఆవరణలో ఉన్న భవిత పాఠశాల (ప్రత్యేక అవసరాలగల పిల్లల వనరుల కేంద్రం), ఎలిమెంటరీ స్కూళ్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పరిసరాలను పరిశీలించారు. భవిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వసతులను మెరుగుపరచాలని, అక్కడి టీచర్లకు సూచించారు. పాఠశాలకు చెందిన మరుగుదొడ్డి సక్రమంగా లేదని, కొత్తగా నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తేవాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డిని ఆదేశించారు. ఎలిమెంటరీ పాఠశాల పరిసరాలు, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. అక్కడి వంటశాల అసంపూర్తిగా ఉండడంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. తదనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలన పాటించి.. విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

'బ్రూసెల్లోసిస్' నిర్మూలనకు వ్యాక్సినేషన్

చిన్నమండెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణలో భాగంగా మండలంలోని మల్లూరులో శుక్రవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించడం కోసం ప్రతి ఒక్కరూ పెయ్యదూడలకు వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా పశు సంవర్థకశాఖ సంచాలకులు గుణశేఖర్‌పిళ్లై సూచించారు. రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, కడప వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి, స్థానిక పశువైద్యులు గణేశ్, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ దారులపై చర్యలు తప్పవు

గాలివీడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ కుషావతి నది సమీపంలోని వాగు పోరంబోకును ఆక్రమించిన వారికి త్వరలోనే నోటీసులు అందజేస్తామన్నారు. పట్టా భూముల సమస్యలను కూడా విచారణ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి

రాజంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం రాజంపేట పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

లక్కిరెడ్డిపల్లె: సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు మేలు చేకూరుతుందని మంత్రి మండిపల్లె సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాదురెడ్డి తెలిపారు. శుక్రవారం పందిళ్లపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జే వడ్డెపల్లెలో జేజేఎం నిధులతో బోర్లు వేసినట్లు దొంగ లెక్కలు చూపించి నిధులు స్వాహా చేశారన్నారు. ఎన్నికల ముందు మండిపల్లె రాంప్రసాదురెడ్డి తన సొంత నిధులతో బోరు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మూగి వెంకటరమణ, పాలెం సుబ్బారెడ్డి, ధనాంజనేయ, షేక్‌ఖాజా, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, అమానుల్లా, శ్రీనివాసరాజు, జయచంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

గుట్టలనూ ఆక్రమిస్తున్నారు!

● హెచ్చరిక బోర్డులు తొలగించి మరీ సాగు ● వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు ● స్తబ్దంగా రెవెన్యూ విభాగం


పుల్లగూర గండి సమీపంలో హెచ్చరిక బోర్డు తొలగించి సాగు చేసిన పొలం


వీరబల్లి సమీపంలో చదును చేసిన కొండ

వీరబల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కొండలు, గుట్టలు సైతం ఆక్రమణదారుల భూదాహానికి బలవుతున్నాయి. ఇలా ఆక్రమించిన భూములను చదును చేసి యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నా పట్టించుకునే నాథులు లేకుండా పోయారు. ఈ విషయంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుకున్న అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని, ఎవరూ ప్రవేశించరాదంటూ బోర్డులు నాటినా, వారు అటు వెళ్లగానే దానిని తొలగించి మరీ సాగు కొనసాగిస్తున్నారు. వంగిమళ్ల గ్రామంలోని పుల్లగూర గండి సమీపంలో ఉన్న ఊరగుట్టను ఇటీవలే కొందరు చదును చేసి సాగు భూమిగా మార్చారు. ఈ విషయం గుర్తించి గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని సందర్శించి ఇది ప్రభుత్వ స్థలం అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం వారు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారుడు ఆ భూమిలో పంట సాగు చేశాడు. ఈ విషయంపై మళ్లీ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి యథావిధిగా బోర్డు నాటడంతో సరిపెట్టారు. వీరబల్లి మండల కేంద్రం సమీపంలోని చెక్‌పోస్ట్ వద్దనున్న పాలకొండను సైతం కొందరు చదును చేసి సాగు భూమిగా మార్చారు. ఈ విషయంపై కూడా స్థానికులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకున్న సందర్భాలు కనిపించలేదు. పెద్దివీడు తదితర గ్రామాల్లో గుట్టలు, కొండలు చదును చేసి సాగుభూమిగా మార్చారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొండలు, గుట్టలు కనిపించకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఫిర్యాదు అందించిన వెంటనే వెళ్లి చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. ఆక్రమణదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సాగుభూమిగా మార్చిన ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చే ప్రసక్తే ఉండదని తెలిపారు.

- శ్రావణి, తహసీల్దారు

సీఎం చేతులమీదుగా కేకే చౌదరికి టీడీపీ సభ్యత్వం


కేకే చౌదరికి శాశ్వత సభ్యత్వం ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


సభ్యత్వం రసీదును ముక్కా వరలక్ష్మికి అందజేస్తున్న దాసరి దామోదర్‌నాయుడు

చిట్వేలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నట్లు చిట్వేలి మండల టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేకే చౌదరి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాదబీమా తీసుకువచ్చిన తొలిపార్టీ టీడీపీ అన్నారు. సభ్యత్వం ద్వారా వచ్చిన నగదును కార్యకర్తల సంక్షేమానికి ఉపయోగిస్తారని తెలిపారు.

పెనగలూరు: పెనగలూరు మండలం పేరంవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాసరి దామోదర్ నాయుడు లక్ష రూపాయలు చెల్లించి తెలుగుదేశంపార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మండల పర్యటనకు విచ్చేసిన టీడీపీ నియోజకవర్గ నాయకురాలు ముక్కా వరలక్ష్మికి సభ్యత్వ రుసుం రసీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌చౌదరి, కళాచంద్ర, కాకర్ల నాగేశ్వరరావునాయుడు, సురేష్‌రెడ్డి, కస్తూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖరాజుపల్లె మిట్టలో ఉపాధిహామీ పనులను శుక్రవారం ఏపీవో ఆకస్మికంగా తనిఖీ చేసి కూలీల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనంబరు 405లో రెండు వారాల నుంచి వంక పూడికతీత పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే స్థానిక చెరువులోకి నీరు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం బంగారుపేట గ్రామంలో గోకులం షెడ్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కూలీలు పాల్గొన్నారు.

అపార్ నమోదు పరిశీలన

ఓబులవారిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అపార్ నమోదు ప్రక్రియను శుక్రవారం ఎంపీడీవో విజయరావు, విద్యాశాఖాధికారి రెడ్డయ్య పరిశీలించారు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న మొదటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

చెన్నకేశవాలయంలో బారికేడ్ల ఏర్పాటు

సుండుపల్లి, నవంబరు 08 (ఆంధ్రజ్యోతి): విరూపాక్ష చెన్నకేశవ స్వామి అలయ ప్రాంగణంలో స్థానికుడు ఆంజనేయులు రూ. 20 వేల వ్యయంతో భక్తులు క్యూ పాటించేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. పలువురు దాతల సహకారంతో సుమారు 20 మీటర్లు సిమెంటు రోడ్డు వేయించారు. నెల రోజుల వ్యవధిలో అలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాజంపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 11న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేయాలంటు శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఏఐటీయూసీ నాయకుడు సికిందర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇంతవరకు అమలు చేయలేదన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ కృపావతి తెలిపారు. మండలంలోని కుమ్మరపల్లిలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవలి కాలంలో 7448.94 ఎకరాల్లో చేసిన రీ సర్వే కారణంగా భూ సమస్యలు ఏవైనా ఏర్పడి ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మసీదు నిర్మాణానికి అడ్డంకులు తొలగించండి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం లు

పెనగలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు గ్రామకంఠంలోని ఈద్గా మైదానంలో మసీదు నిర్మాణానికి అడ్డంకులను తొలగించాలని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు శుక్రవారం అర్జీ ఇచ్చినట్లు టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ షామీర్ తెలిపారు. అన్ని అనుమతులు తీసుకొని నిర్మాణం ప్రారంభించినా, గ్రామంలోని కొంత మంది దౌర్జన్యంగా పనులు నిలిపివేశారని తెలిపారు. ఈద్గా షాపింగ్ కాంప్లెక్స్‌లోని రెండు మూడు గదుల్లో పలుకుబడి కలిగినవారు దుకాణాలు నిర్వహించుకుంటూ నిరుపేదలకు గదులు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ లీలారాణికి మొరపెట్టుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారాల్లో విచారణ చేయించి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఖలీల్‌బాషా, మహబూబ్ బాషా, మస్తాన్‌వలి, మహ్మద్‌రఫీ, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలి

రాయచోటిటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు, పేద ప్రజల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించే విధానం మానుకోవాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త ఆందోళనలు విజయవంతం చేయాలంటూ శుక్రవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, నిర్బంధ భూసేకరణ చట్టం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వరదలు, చీడ పీడలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వరంగ బీమా సంస్థల ద్వారాలనే నష్ట పరిహారం ఇప్పించాలని, ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డెయిలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరారు. హంద్రీ-నీవా, గాలేరు- నగరి ప్రాజెక్టులతోపాటు అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రబీ టమోటాకు క్రాప్ ఇన్సూరెన్స్

రాయచోటిటౌన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసే టమోటా పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి తెలిపారు. శుక్రవారం పట్టణంలో రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు నాటే టమోటా పంటకు వాతావరణ మార్పుల కారణంగా నష్టం జరిగితే పరిహారం అందించేందు ప్రభుత్వం ఈ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎకరాకు రూ.1600 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.32 వేలు పరిహారం బీమాను పొందవచ్చునని తెలియ జేశారు. టమోటా పంటపై బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో అంగీకార పత్రాన్ని ఇస్తే బ్యాంకు నేరుగా బీమా ప్రీమియంను మినహాయించుకుంటుదన్నారు. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో కానీ, రైతు సేవా కేంద్రంలోని కానీ 1బీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రం సమర్పించి నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం కేంద్రం (ఏపీ బీసీ స్టడీ సర్కిల్) అన్నమయ్య జిల్లా సంచాలకులు సందప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ బీసీ స్టడీ సర్కిల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, రూమ్ నెంబర్ 5, బ్లాక్ నెంబర్1, ఎస్టీ గురుకుల విద్యాలయం వెనుక, ఓదివీడు రోడ్డు, రాయచోటి, అన్నమయ్య జిల్లాలో 12వ తేదీ లోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9912445108, 9494075135 నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

నేడు చిన్నమండెం మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సభా భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, రెవెన్యూ, నిత్యావసర వస్తువులు, గృహ నిర్మాణం, ఆరోగ్యం, తాగునీటి సరఫరా, పశుసంవర్ధక శాఖ, విద్యుత్, రవాణా, ఉపాధి వంటి అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల రెడ్డివారిపల్లెకు చెందిన సందూరి హేమనాథ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా సరైన చికిత్స చేయించలేక పోతున్నామని కుటుంబసభ్యులు మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించి సీఎం సహాయనిధి కింద 10 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును త్వరలో బాధితుడికి అందజేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు..

హ్యాండ్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు

రైల్వేకోడూరు, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి) మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన జట్లు పాల్గొంటాయని, గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని స్కూలు గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చమర్తి శారద తెలిపారు. క్రీడాకారులు సమయపాలన పాటించాలని తెలిపారు.

నేటి నుంచి మగ్దూంబాబా ఉరుసు

నందలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మగ్దూంబాబా దర్గాలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఉరుసు నిర్వహిస్తున్నట్లు చిన్నపీఠాధిపతి హైదర్‌సాహెబ్ తెలిపారు. 9న నిషాన్, 10న గంధం, 11న ఉరుసు, 12న జియారత్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

17న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

పెనగలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాదిగ దండోరా ఆధ్వర్యంలో ఈ నెల 17న కడప నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్నిజయప్రదం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంబడి రాధాకృష్ణ, కార్యదర్శి నగరిపాటి చంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెనగలూరు అరుంధతివాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

మాజీ సర్పంచ్ మృతి టీడీపీకి తీరనిలోటు


మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్యకు నివాళులు అర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సంబేపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణరెడ్డిగారిపల్లె మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య మృతి పార్టీకి తీరనిలోటు అని రాష్ట్ర టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ బీసీ సాధికార సమితి పాలఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు, టీడీపీ నాయకులు మౌర్యారెడ్డి తెలిపారు. శుక్రవారం నారాయణరెడ్డిపల్లె గ్రామం ఎర్రగుంట్లలో ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించండి

గాలివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు ప్రహరీగోడ నిర్మించాలని మండల కేంద్రంలోని సలాదివాండ్లపల్లి వాసులు ఎంపీడీవో జవహర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ప్రహరీగోడ లేకపోవడంతో స్థానికులు నిర్మాణ వ్యర్థాలను అక్కడ పడేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రహరీ గోడకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

చిన్నమండెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం కొత్తపల్లి యూనిట్ చెరువు కింద కుర్వపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. టీం లీడ్ చందురెడ్డి, ఏఈవో అనూష, ఎస్ఈఆర్‌పీ నుంచి సీసీలు, ఎఫ్‌పీవో సీఈవో సుఖదేవ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

రైల్వేకోడూరు, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెంగమరాజుపోడులో గురువారం సాయంత్రం టీడీపీ నాయకురాలు వాణిపై అదే గ్రామానికి చెందిన హెచ్. చంద్రరాజు దాడి చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు శుక్రవారం తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఆమెతో చంద్రరాజు వాగ్వాదానికి దిగడంతోపాటు పైట కొంగు లాగి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

అంతా మీ ఇష్టమేనా?

● ఎస్టిమేషన్లు లేకుండానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారా ● ట్రాన్స్‌కో సబ్ ఇంజనీరుపై ఎంపీపీ ఆగ్రహం


ట్రాన్స్‌కో, రెవెన్యూ అదికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ ముద్దా వెంకటసుబ్బారెడ్డి

పుల్లంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే ఇటీవల 56 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చారు, 12 చోట్ల విద్యుత్‌లైన్లు లాగారు. అంతా మీ ఇష్టమేనా? అని ఎంపీపీ ముద్దా వెంకటసుబ్బారెడ్డి ట్రాన్స్‌కో సబ్ ఇంజనీరు శివప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో పుల్లంపేట ఎంపీడీవో జయశ్రీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాన్స్‌కో సబ్‌ఇంజనీరు, మండల రెవెన్యూ అధికారిపైన ధ్వజమెత్తారు. ఎస్టిమేషన్లు వేయకుండానే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తారా? అంతా మీ ఇష్టమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అక్రమంగా ఇచ్చే విద్యుత్ లైన్లను వాడుకుని వన్యప్రాణులను చంపేస్తున్నారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అనంతసముద్రం ఎంపీటీసీ సభ్యుడికి చెందిన స్థలం ఆక్రమణపై విచారణకు జాయింట్ కలెక్టర్ ఆదేశించినా బేఖాతరు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భూమిని సర్వే చేయాలని ఏప్రిల్ నెలలో ఓ రైతు చలానా కడితే, ఇన్ని రోజులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పులివెందుల, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలకు చెందినవారు ఇక్కడ భూములు ఆక్రమిస్తుంటే ఏమి చేస్తున్నారంటూ నిలదీశారు. ఈ విషయాలపై తీర్మానాలు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నమ్మ, జయశంకర్, డాక్టర్ మనోజ్‌చంద్ర, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముస్తాక్ ఎంఈవో నాగతిరుమలరావు, పశు వైద్యాధికారి సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ శిబిరానికి పీలేరు విద్యార్థి ఎంపిక



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సన్నాహక శిబిరానికి ఎన్‌సీసీ క్యాడెట్ బాలాజీ ఎంపికయ్యాడు. స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ 17 నుంచి 26వ తేదీ వరకు సికింద్రాబాదులో జరగనున్న సన్నాహక శిబిరంలో శిక్షణ తీసుకుంటాడని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రైతు

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులు ఆంజనేయులు, పాపిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం బందార్లపల్లెకు చెందిన ఆంజనేయులు, కురబలకోట మండలం ముదివేడు వాసి పాపిరెడ్డి కర్ణాటక రాష్ట్రం చింతామణిలో కూరగాయల విత్తనాలు కొనుక్కు. రావడానికి బైక్‌లో బయలుదేరారు. బురకాయల కోట వద్ద బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతులిద్దరూ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హక్కుల కోసమే పోరాటం

మదనపల్లె అర్బన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బీసీ హక్కుల పోరాట సమితి పోరాటం ప్రజల కోసమేగాని పదవుల కోసం కాదని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యసభ సీట్లలో బీసీలకే మొదటి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవా ధ్యక్షుడు రామలింగ, రాయలసీమ ఆర్గనైజర్ కార్యదర్శి వెంకటేశ్వరయాదవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు పోతబోలు వెంకటరమణ, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి యువరాజ్ నాయక్ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవతానగర్ వాసి అన్నయ్యనాయక్ కుమారుడు యువరాజ్ నాయక్ ఇంటర్ చదువుతున్నాడు. బైక్ కొనాలనడంతో అమ్మ మందలించిందని మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. తాలుకా సీఐ కేసు నమోదు చేశారు.

రైతులకు ఆదర్శం శంకర్‌రెడ్డి వ్యవసాయం

- ఉష్ణప్రాంతంలోనూ ఆపిల్ పండించిన కృషి
- నూతన పంటల సాగు..అధిక దిగుబడులు
- పక్క రాష్ట్రాలకూ పాకిన వైనం



రూ. 40 లక్షలతో రైతు శంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన పాలీ హౌస్



సాధించిన అవార్డులతో రైతు శంకర్‌రెడ్డి

వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం జూదమంటున్న తరుణంలో పలువురు రైతులకు రైతు శివశంకర్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు. అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డి 15 ఎకరాల పొలంలో తరతరాలుగా వస్తున్న వ్యవసాయాన్ని అందిపుచ్చుకుని వేలాది మంది రైతులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. 20 ఏళ్ల కిందట తనకున్న రెండన్నర ఎకరాల పొలంలో వేరుశనగ, చెరకు, కూరగాయలు, తదితర పంటలను తనదైన శైలిలో సాగు చేసి అధిక దిగుబడులు రాబడ్డటం, తర్వాత అంచెలంచెలుగా తన మేదోశక్తితో వ్యవసాయాన్ని అభివృద్ధి బాట పట్టించాడు. శీతల ప్రదేశాల్లో పండే ఆపిల్ పంటను సైతం సకాలంలో పండించి శభాష్ అనిపించు కుంటున్నారు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తెచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలను నాటి కంటికి రెప్పలా కాపాడాడు. అంతే ఏడాదికి ఆపిల్ కాయలు విరగ్గాశాయి. ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. బీడు భూములను వ్యవసాయ భూములుగా మారుస్తూ రైతులకు సైతం ఎన్నో మెలుకువలు నేర్పిన ఘనత శివశంకర్ రెడ్డికి దక్కుతుంది. కేవలం సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారాయన. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం మండలం అయ్యవారిపల్లె రైతు శివశంకర్‌రెడ్డికి 15 ఎకరాల పొలం ఉంది. 2007లో మూడెకరాల్లో కదిరి రకం వేరుశనగ పంట సాగు చేసి అధిక దిగుబడులు రాబట్టాడు. చుట్టుపక్కల గ్రామీణ రైతులు సైతం అప్పట్లోనే ఆశ్చర్యపోతూ శివశంకర్ రెడ్డిని అభినందించడం గమనార్హం. ఇక అప్పటి నుంచి వ్యవసాయమే జీవనాధారంగా రైతు శివశంకర్‌రెడ్డి కుటుంబం శ్రమించ సాగింది. నష్టాలు చవిచూసినా అధైర్య పడక చెరకు, వేరుశనగ, చాందినీపూలు, చామంతి, లిల్లీ (తెలుపు, పసుపు),



తదితర పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు రావడంతో వెను దిగిరి చూసుకోకుండా పరిశోధనాత్మకంగా అనేక రకాల పంటలను సాగు చేయడానికి సిద్ధం చేసుకోవడం గమనార్హం. తన వ్యవసాయ క్షేత్రంలో నాలుగేళ్ల కిందట సాగు చేసిన ఆలీవ్ మొక్కలు ఏపుగా పెరిగి మరో ఏడాదిలో పంట రానుంది. గతేడాది హరిమాన్ 99 రకం యాపిల్ మొక్కలను అధిక పెట్టుబడులతో ప్రయోగాత్మకంగా చేసిన మొక్కలు ఏపుగా పెరిగి యాపిల్ కాయలు విరగ్గాశాయి. దీంతో తిరిగి అదే రకం యాపిల్ మొక్కలను సాగు చేశాడు. దేశంలో అరుదైన మకడమియా డ్రై ఫ్రూట్ పంటను పరిశోధనాత్మకంగా మొదలు పెట్టి సాగు చేయడానికి ముందడుగులు వేస్తున్నారు. ఆ రకం డ్రైఫ్రూట్ కిలో రూ.2వేలకు పైగా పలుకుతుండడం గమనార్హం. చామంతి మొక్కల్లో ఐదురకాలు పెంపకానికి రంగం సిద్ధం చేస్తున్నాడు. అయ్యవారిపల్లె మొదలుకుని రాష్ట్రాలు దాటి వేలాదిమంది రైతు కుటుంబాలకు ఆదర్శంగా నిలిచాడు. నర్సరీల్లో సైతం శివశంకర్‌రెడ్డి వంగడాలు, పూల రకం మొక్కలు తదితరాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా పశువుల ఎరువు, సూక్ష్మపోషక ఎరువుల వాడకంతో పంటల నుంచి అధిక దిగుబడులు రాబట్టవచ్చని చెబుతున్నారు. ఈయన వ్యవసాయ క్షేత్రంలో సుమారు రూ.40లక్షల పెట్టుబడితో ఓ పాలీహౌస్, రూ.7లక్షలతో ఒకటిన్నర ఎకరాలో షైడ్‌నెట్ నర్సరీ నిర్వహిస్తున్నారు. ప్రతి రైతు తన మోదో శక్తితో వ్యవసాయం కుంటుపడకుండా ముందుకెళ్లాలని, తనను కలిసే ప్రతి రైతుకు ఎప్పటికప్పుడు వ్యవసాయ మెలకువలు నేర్పుతున్నానంటున్నారు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వం సబ్సిడీలతో సరిపెట్టుకోకుండా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా రైతాంగానికి చేయూత నిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ వ్యాప్తంగా మన రాష్ట్రానికి వ్యవసాయ రంగంలో ఎంతో ముందుందని చెప్పడంలో సందేహం లేదు. ప్రభుత్వాలు మారినా రైతుల స్థితిగతులు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా ఉచితాల పంపిణీ కంటే ముందుగా రైతుల అవసరాలను గుర్తించి మేలు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతుకు అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటే హర్షించదగ్గ విషయమే.

- శివశంకర్‌రెడ్డి, ఆదర్శ రైతు, అయ్యవారిపల్లె, వాల్మీకిపురం

శంకర్‌రెడ్డిని వరించిన అవార్డులు..

2007లో రైతు శివశంకర్‌రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. 2009లో ఆలిండియా రేడియో ఉత్తమ వ్యాఖ్యాతగా అవార్డు, 2014, 2019లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పూల సాగు రైతుగాను, ఇలా ఎన్నో పురస్కారాలు సొంతం చేసుకున్నారు. ఐదు నెలలుగా విదేశీ శాస్త్రవేత్తల బృందం శివ శంకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రశంసించడం గమనార్హం.

ఉష్ణప్రాంతంలో విరగ్గాసిన ఆపిల్

కశ్మీర్.. సిమ్లా... పంటను ఉష్ణ ప్రాంతాల్లో ఆపిల్ పంటను సేంద్రీయ పద్ధతిలో సాగుచేశారు. కేవలం శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే ఆపిల్ కరవుప్రాంతంలో విరగ్గాశాయంటే అది రైతు శివశంకర్‌రెడ్డి కృషిగానే చెప్పవచ్చు. రాజస్థాన్ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన అన్నా, హరిమాన్ రకాల ఆపిల్ మొక్కలు కంటికి రెప్పలా కాపాడాడు. తాను పెంచిన మొక్కలకు ఎలాంటి చీడ, పీడలు కూడా కలగలేదని, కేవలం మొక్కలు పెరగడానికి మాత్రమే నీటిని పెట్టామన్నారు. శీతల ప్రాంతాల్లో లాగే మార్చి నెలలో పూతతో మొదలై ఆగస్టులో పంట పండ్లు కాయడం విశేషమని చెబుతున్నారు. 5 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత్తలుండే ప్రాంతంలో పండించే ఆపిల్ పంట 45 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వేడి ఉన్నా పంట సాగుకు ఉష్ణ ప్రాంతాలకు అనువైన వంగడాలను శాస్త్రవేత్త లు అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబరిచి ఎన్నో విషయాలను బయటకు తేవడం గమనార్హం. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించని ఆపిల్ పంట భవిష్యత్తు తరాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఆపిల్ కాయలు విరగ్గాయడంతో ఇటీవల 300 ఆపిల్ పండ్లు తన కుటుంబ సభ్యులు, కూలీలకు పంచిపెట్టాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఆపిల్ ధర రూ.150 నుంచి 200 పలుకుతుండగా మన ప్రాంతాల్లో మాత్రం రైతులు ఆసక్తి చూపకపోవడం బాధాకరం. అయితే మన ప్రాంతంలో కూడా పంట సాగు చేయవచ్చని రైతు చెబుతున్నాడు.



శివశంకర్‌రెడ్డి సాగు చేసిన హరిమాన్ రకం యాపిల్ (ఫైల్‌ఫొటో)

జింకల గుంపు రాకతో అదుపుతప్పిన బైక్

దంపతులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సుకన్య

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జింకల గుంపు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి భార్యభర్తలు గంగులప్ప, సుకన్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మద్దినాయనిపల్లె పంచాయతీ నాయనివారిపల్లె వాసి గంగులప్ప భార్యతో కలిసి సొంత పనుల నిమిత్తం బైక్‌లో ములకల చెరువుకు వచ్చారు. పనిముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ములకల చెరువు వద్ద జింకల గుంపు అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ రేషన్ పట్టివేత

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు



తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాధవరం-1 శివారు షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌బియ్యం గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని చుట్టుపక్కల పొలాల్లో రైతులను విచారించగా జంగాలపల్లె వాసి రాజు అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. దాదాపు 300పైగా రేషన్ బియ్యం బస్తాలను ఒంటిమిట్ట సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వ్యవసాయాధికారి గంగాధర్, ఏఈఈ అశోక్‌కుమార్, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, నవంబర్ 8:(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి విక్కీ, మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

'హైందవ శంఖారావం' కరపత్రాలు ఆవిష్కరణ

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 2025న హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. సొసైటీ కాలనీలోని రామాలయంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయడానికి విశ్వహిందూ పరిషత్, హిందూచైతన్య వేదిక, సమరత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. వేణుగోపాల్‌నాయుడు, భానుప్రకాష్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

12 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం ● ఎనిమిది మంది పరార్ : ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి



పట్టుబడిన నిందితుడితో ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది

సిద్దవటం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం బీట్ భద్రికోన అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని, 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామని సిద్దవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ అందిన సమాచారంపై కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాలపై సిబ్బందితో గురువారం రాత్రి భద్రికోన అటవీ ప్రాంతంలో తనిఖీ చేశామన్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు దుంగలను లోడు చేస్తుండగా సిబ్బందిని చూసి పరారయ్యారన్నారు. వారిని వెంబడించి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభ్యమైన 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. స్మగ్లర్‌ను విచారించగా నెల్లూరు జిల్లా కలువాయి మండలం తిరుమలపాడు వాసి వెంకటేశ్‌గా తెలిపాడన్నారు. బెంగుళూరు వాసి హయాజ్ కారు, 8 మంది కూలీలను అప్ప జెప్పి ఎర్రచందనం దుంగలను తీసుకురావాలన్నాడని అంగీకరించాడు. పరారైన 8 మంది కూలీల కోసం అటవీ సిబ్బంది గాలిస్తున్నామన్నారు. దుంగల బరువు 274 కిలోలు ఉండగా రూ.76120 విలువైనవన్నారు. కేసు నమోదు చేసి వెంకటేశ్‌ను తిరుపతి కోర్టుకు హాజరు పరుస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో నేటి నుంచి సవరణలు

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో సవరణల కోసం పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలను ఈనెల 9, 10, 23, 24 (శని, ఆదివారాలు) తెరిచి ఉంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యా శాఖకు ఆదేశాలు జారీ చేస్తూ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో ఓటర్ల సవరణ దరఖాస్తులు స్వీకరించేందుకు అనువుగా పాఠశాలల గేట్లు తెరిచి ఉంచాలని తహసీల్దార్లు ఎంఈఓలను కోరారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల ఆవరణల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారన్నారు. జనవరి 1కి అర్హులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తహసీల్దారు నవీన్ తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై పోలీసుల దాడులు

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చీకల బైలు గ్రామం బెంగళూరు రోడ్డులోని బార్లపల్లె వద్ద గుట్ట లో కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. కోడిపందెం ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, 8 బైకులు, రూ. 35,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలి పారు.

చెన్నకేశవస్వామి ఆలయ భూములు స్వాధీనం



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఈఓ, ఎస్ఐ

రామసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కురిజల గ్రామం పురాతన చెన్నకేశవ స్వామి ఆలయం వివాదాస్పద భూములను స్వాధీనం చేసుకున్నట్లు దేవదాయ శాఖ ఈఓ రమణ తెలిపారు. సర్వే నెంబర్లు 52/14లో 1.60 సెంట్లు, 57/25లో 22 సెంట్లు, 52/10లో 18 సెంట్లు, 41/4లో 8 సెంట్లు, 52/3లో 7 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకున్నామని, త్వరలో లీజువేలం నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు ఈఓ తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య సమక్షంలో పంచనామా చేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, ఏఎస్ఐ హిమాచలపతి, రెవెన్యూ సిబ్బంది, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, దొడ్డిపల్లె ఆనంద, మాజీ జడ్పీటీసీ శివశంకర్, రాజేశ్, మాలమహానాడు అధ్యక్షుడు క్రిష్ణప్ప, చెంగారెడ్డి, నాగరాజ, భూలక్ష్మి, శంకర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

● శిక్షణ తరగతుల్లో అబ్జర్వర్ ప్రసాద్



శిబిరంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ప్రసాద్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ఎంపీడీఓల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలని అబ్జర్వర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 18 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, ఇద్దరేసి పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమ అబ్జర్వర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే ఈ తరగతుల్లో 2025-26 వార్షిక సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే వచ్చే ఆర్థిక సంవత్సరం నిధులు మంజూరవుతాయన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీఎల్‌పీఓ లక్ష్మీపతి, రిసోర్స్ పర్సన్ దిలీప్‌కుమార్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

గుంటూరు వాసి అశోక్‌రెడ్డి మదనపల్లెలో అదృశ్యం



మదనపల్లె అర్బన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అప్పు వసూళ్ల కోసం మదనపల్లెకు వచ్చిన గుంటూరు వాసి అశోక్‌రెడ్డి అదృశ్యమయ్యాడని టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గుంటూరుకు చెందిన ఎర్రం అశోక్‌రెడ్డి మదనపల్లె మండలం, అవకిశెట్టిపల్లెకు చెందిన కిషోర్‌రెడ్డికి సుమారు రూ. 56 లక్షలు అప్పు ఇచ్చాడు. ఇచ్చిన అప్పు ను వసూళ్ల కోసం ఈ నెల 5వతేదీన భార్య శ్యామలతో కలిసి మదనపల్లెకు వచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ లాడ్జీలో భార్యను ఉంచి అప్పు వసూలుకు చిత్తూరు బస్టాండ్‌కు వెళ్లాడు. దీంతో 6వ తేదీ నుంచి కనపడకుండా పోయాడంటూ భార్య శ్యామల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసును నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసు సాక్షిగా... బహిరంగ మద్యపానం



అక్కడ పోలీసు ఉన్నాడు... మద్యం దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలు వివరిస్తున్నాడు. ఆ పక్కనే ఉన్న చిల్లర కొట్టు వద్ద ఓ వ్యక్తి తాపీగా మద్యం తాగుతున్నాడు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు పెట్టి జరిమానా విధిస్తున్న పోలీసులు వారి ముందే షాపు వద్ద మద్యం తాగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇది శుక్రవారం ఉదయం 11.15 గంటలకు స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపం పక్కన రింగ్ రోడ్డులో ఉన్న యుగంధర్ వైన్స్ వద్ద జరిగింది.

- మదనపల్లె టౌన్,(ఆంధ్రజ్యోతి)

స్కూటర్‌ను ఢీకొన్న టిప్పర్ రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి మృతి




ప్రమాద స్థలంలో రామచంద్రారెడ్డి మృతదేహం, రామచంద్రారెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ విద్యుత్ లైన్‌మ్యాన్ గుత్తి రామచంద్రారెడ్డి(72) మృతి చెందాడు. ఎర్రగుంట్ల నగరపంచాయతీ న్యూకాలనీలో నివాసం ఉంటున్న రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు బయలు దేరాడు. నాలుగు రోడ్ల కూడలిలోని ఆర్‌టీబీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో టిప్పర్ కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌బాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా, ఏరువాక గంగమ్మ ఆలయ కమిటీ ట్రెజరర్‌గా ఉన్న రామచంద్రారెడ్డి మృతి పట్ల కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఎర్రగుంట్ల మండల ఎన్డీయే ఇన్‌చార్జి మధు సూదన్‌రెడ్డి సంతాపం తెలిపారు.

70 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



ప్రొద్దుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని వాసవీ ట్రాన్స్ పోర్టు పక్కన ఓ గదిలో 70 రేషన్ బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు గంగయ్య డీటీ సాయినాధరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జునలు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఉన్నట్లు గుర్తించిన గది షెట్టర్ తాళాలు పగలగొట్టి.. అందులో వున్న రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. 70, 50 కేజీల బస్తాలు మొత్తం 3500 కేజీలు ఉంటాయని అంచనా వేశారు. బియ్యంతో పాటు 15 కేజీల కంది బేడలు, 7కేజీల చెక్కర కూడా వున్నట్లు తెలిపారు. ఈ గదిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వలు ఎవ్వరు పెట్టారనేది అధికారులు తేల్చ లేకపోయారు. దీంతో కేసు నమోదు చేయకుండానే వీటిని స్వాధీనం చేసుకున్నారు. బొల్లవరంలో ఒక అద్దె గదిలో 14 రేషన్ బియ్యం బస్తాలను సురేంద్ర అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేయడం గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాటిని సీజ్ చేశారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్ర హరిత, నందిని

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థినులు విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. హాస్టల్ గేటు వద్ద అపస్మారకస్థితిలో పడిపోయిన వీరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలిలా.. ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటున్న ఆర్.చంద్రహరిత, సి.నందిని జమ్మలమడుగు పట్టణంలోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు స్నేహితులు. కాగా... గురువారం రాత్రి 9.30గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటికి వెళ్లారు. తిరిగి హాస్టల్‌కు వస్తుండగా ఏం జరిగిందో ఏమో కానీ ఉన్నట్లుండి హాస్టల్ గేటు వద్ద పడిపోయారు. వెంటనే హాస్టల్ వార్డెన్ అక్కడున్న వర్కర్ విషద్రావణం తాగినట్లు గుర్తించి.. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఆర్.చంద్రహరితను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, సి.నందినిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలిసిన అర్బన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది వసతి గృహం వద్దకు చేరుకొని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా ఆమె దాటవేశారు.

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత లింగమూర్తి మృతి



లింగమూర్తి (ఫైల్‌ఫొటో)

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, రాయలసీమ రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ లింగమూర్తి (84) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోనే కాక రాయలసీమ ప్రాంతంలో గుర్తింపు ఉన్న నేత లింగమూర్తి అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అనేక దఫాలుగా పోరాటాలు చేస్తూ రైతాంగాన్ని మేల్కొలిపిన నేత అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కమిటీ సభ్యుడిగా, రాయలసీమ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లింగమూర్తి పనిచేశారని తెలిపారు.

నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితంపై విరక్తి చెందిన నిప్పంటించుకుని అమరనాథ్(45) అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల మేరకు మండలంలో ఊలపాడు గ్రామానికి చెందిన అమరనాథ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే వారు అందరూ అమరనాథ్‌ను వదలి గత ఐదేళ్లుగా బెంగళూరులో కాపురం ఉంటున్నారు. దీంతో ఒంటరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నా అతను జీవనంపై విరక్తి చెంది శుక్రవారం తన ఇంటిలోనే నిప్పంటించుకుని ఆత్మహత్యాయ్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన గ్రామస్థులు వెంటనే అమరనాథ్‌ను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు8:(ఆంధ్రజ్యోతి) మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ బస్సును టెంపో ఢీ కొట్టిన సంఘటనలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. మదనపల్లె టూ డిపో బస్సు పీలేరు నుంచి వస్తుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న టెంపో బస్సును ఓవర్ టాక్ చేస్తుండగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నలుగురు స్వల్పంగా గాయపడగా వాల్మీకిపురం మండలం, గడ్డబోయనపల్లెకు చెందిన మల్లమ్మ(48), లక్ష్మీదేవి(46) మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందారు.

మీకు సగం... మాకు సగం

- ఆక్రమణలలో ఐక్యత చాటుతున్న ఇరుపార్టీల కబ్జాదారులు
- వాటాలు పంచుకునేందుకు ఎత్తుగడ
- మళ్లీ చేతివాటం ప్రదర్శిస్తున్న నకిలీ పట్టారాయుళ్లు
- బద్వేలులో భూ దందాలకు తెరపడేనా..



బద్వేలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు అడ్డా బద్వేలు నియోజకవర్గం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు ఎక్కడ కనబడితే అక్కడ గద్దల్లా వాలిపోయి కబ్జాలకు పాల్పడేవారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో పెద్ద ఎత్తున భూములు వైసీపీ నేతల కబంధ హస్తాలలో చిక్కుకున్నాయి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూలిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆపార్టీకి చెందిన కొందరు కబ్జారాయుళ్లు వైసీపీ అక్రమార్కుల కంటే తామేమీ తీసిపొమ్మన్నట్లు భూ ఆక్రమణలకు తెరలేపారు. అయితే ఇప్పటికే వైసీపీ వారు కనిపించిన ప్రభుత్వ భూములన్నింటిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. దీంతో చేసేది లేక కూటమి నాయకులు వైసీపీ ఆక్రమణదారులతో చేయి కలిపారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కబ్జా చేసిన భూములు, ఇతర స్థలాలకు మేం రక్షణ కల్పిస్తాం, అవసరమైన మేరకు అమ్మేసి ఇద్దరం కలిసి సొమ్ము చేసుకుందామంటూ పన్నాగం పన్నారు. దీంతో బద్వేలు, గోపవరం మండలాలలో కబ్జాల పర్వం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరు పార్టీల కబ్జారాయుళ్లు కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలపై కన్నేసి వచ్చే ఆదాయంలోమీకు సగం, మాకు సగం అన్నట్లు వాటాలు పంచుకునేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

వాటాలు పంచుకునేందుకు...

రోజురోజుకు విస్తరిస్తున్న బద్వేలు పట్టణం దాని పక్కనే ఉన్న గోపవరం మండల ప్రాంతాలలో భూములు, ఇళ్ల స్థలాలకు బాగా డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములు, స్థలాలను అమ్మిసొమ్ము చేసుకున్న మొత్తంలో వాటాలు పంచుకునేం దుకు ఇరు పార్టీల నాయకులు ఎత్తుగడ వేశారు. ఇటీవల బద్వేలు పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఓ ప్లాటు విషయంలో ఇరుపార్టీల కబ్జాదారులు కలిసి అమ్మిన మొత్తంలో అక్కడ పరిస్థితిని, దాని విలువను బట్టి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. గోపవరం మండలంలోని నెల్లూరు రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఇరు పార్టీల నేతలు కలిసి దాదాపు 40 ఎకరాల వరకు ఆక్రమించి వారి ఆధీనంలో ఉంచుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బద్వేలు పరిసర ప్రాంతాలలో ఉన్న కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా 116, 26 సర్వేనెంబర్లలో భారీ స్థాయిలో భూ ఆక్రమణలు జరిగినట్లు సమాచారం. సి.కొత్తపల్లెలో ఒకటి నుంచి 90 సర్వే నెంబర్లలో కూడా భారీ స్థాయిలో భూఆక్రమణలు చోటు చేసుకున్నాయి.

అవే పంచాయితీలు

బద్వేలులో రెవెన్యూ అధికారులు, పోలీసుల వద్ద భూ ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన పంచాయతీలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ రికార్డు కావడం లేదు. ఏదోరకంగా వాటాలు కుదుర్చుకోవడంతో సర్దుబాటు అవుతున్నాయని చెప్పవచ్చు. మరికొన్ని వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ ఇలాంటి నాలుగైదు పంచాయితీలు, వివాదాలు ఉంటున్నాయంటే బద్వేలులో ఇరు పార్టీలకు చెందిన కబ్జారాయుళ్లు చేస్తున్న దందాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించవచ్చు.

నకిలీ పట్టారాయుళ్లకు హెచ్చరికలు

బద్వేలు భూ వివాదాలకు ప్రధాన కారణమైన నకిలీ పట్టాల సృష్టికర్తలపై పోలీసులు దృష్టి పెట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి పట్టుబడ్డవారిని గత ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలిపించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో బద్వేలులో కబ్జాలు, ఆక్రమణల పర్వానికి కొంతకాలం బ్రేక్ వేసి.. స్తబ్దుగా ఉన్న వీరు మళ్లీ ఇటీవల ఇలాంటి కార్యకలాపాలకు దిగుతున్నట్లు సమాచారం. పోలీసులు ఇరు పార్టీలకు చెందిన ఆక్రమణదారులపై దృష్టి పెట్టకపోతే బద్వేలులో మళ్లీ ఆక్రమణల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోవాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శక్రవారం బి.కొత్తకోట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌ఎం పర్వీన్‌తాజ్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త ఓ ప్రత్యేక కార్యక్రమంలా భావించి, పార్టీ అభిమానులు, సానుభూతిపరులు, ఓటర్లను పార్టీ సభ్యత్వం తీసుకునేలా చొరవ చూపాలన్నారు. సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించిన వారికి త్వరలో ఏర్పాటు చేయబోయే పార్టీ గ్రామ కమిటీలు, పార్టీ విభాగాలలో స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్‌ఎం పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తకు ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే రూ.5లక్షలు బీమా వర్తిస్తుందని, గోళ్లపల్లెకు చెందిన కార్యకర్త జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకోవడంతో ఆయనను జయచంద్రారెడ్డి, పర్వీన్‌తాజ్‌లు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేరింగులనారాయణ, వై.శివ, మస్తాన్, గంజి మోహన, గట్టుఅంజి, రెడ్డెన్న, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి, రియాజ్, ప్రభాకర్, ఓబులేసు, శివరాం పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో సంక్షేమం

తంబళ్లపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు సంక్షేమంతో పాటు భరోసా అందుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోసువారిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సభ్యత్వం నమోదు చేయించారు. ప్రతి టీడీపీ కార్యకర్త తప్పక సభ్యత్వం తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాగా, గ్రామంలో పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి వారి సెల్‌ఫోన్ల ద్వారా ఉత్సాహంగా సభ్యత్వం తీసుకున్నారు. నమోకార్యక్రమంలో పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, నాయకులు జయరాంరెడ్డి, వార్డు సభ్యుడు జగదీష్, ఎస్‌ఎంసీ చైర్మెన్ గంగులరెడ్డి, ప్రకాష్, నరేంద్రనాయుడు, రఫీ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజేయులు

నిమ్మనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా అధికారులు కృషిచేయాలని ఎంపీపీ నరసింహులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు గత మూడు నెలలలో వారు చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో నాలుగు గ్రామాలలో సర్వే జరిగిందని అయితే రీసర్వేలో భూమికి సంబంధించి పాస్‌పుస్తకాలలో కొన్ని తప్పులు పడ్డాయని వాటిని గ్రామసభలు పెట్టి సరిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో పరమేశ్వరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే నిమ్మనపల్లిను కరువు మండలంలా ప్రకటించడంతో రైతులకు అన్ని ఎరువులు సబ్సిడీతో వస్తాయని ఏవో మురళి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఏవో ర మేష్, పశువైద్యాధికారి సురేష్, ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు. తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలని నిరసన

మదనపల్లె అర్బన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రభుత్వ సర్వభోదనాస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట పెండింగ్ జీతాలు చెల్లించాలని చెవులో పూలతో శుక్రవారం నిరసన చేపట్టారు. 57 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే ఆప్కాస్‌లో చేర్చి పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కవిత, సాయి, ప్రసాద్, పూర్ణిమా, షైషావలి, నవీనళ్, కృష్ణారెడ్డి, కిరణ్, రాజేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు అవార్డులు

మదనపల్లె అర్బన్, నవంబరు8: అక్టోబరు మాసంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినంద నలతో పాటు నగదు అవార్డులను వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి అందించారు. వన్‌డిపోలో శుక్రవారం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ గత ఏడాదిగా రీజియన్‌లోనే ప్రథమ స్థానం కల్పిస్తున్న ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ ర వి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సులను సకాలంలో నడపండి

మదనపల్లె అర్బన్, నవంబరు8: బస్సులను ప్రయాణికులకు అనుగుణంగా సకాలంలో నడపాలని మదనపల్లె వన్ డిపో మేనేజరు డ్రైవర్లకు సూచించారు. స్థానిక కార్యాలయంలో మదనపల్లె- బికొత్తకోట మార్గంలో వెళ్లే సిబ్బందితో డీఎం మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా గ్రామీణ ప్రాంతాల మార్గంలో బస్సులు నడపాలన్నారు. ప్రతి స్టేజ్ నందు ఆర్టీసీ బస్సును ఆపాలన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కొండాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గురుకుల పాఠశాలను శక్రవారం గురుకుల పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులు పాము కాటుకు గురైన నేపథ్యంలో తాడేపల్లె నుంచి వచ్చిన ఆయన పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వారంలోపు పూర్తిగా శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.

వైభవం సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న స్వామివారు

పెద్దమండ్యం నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దమండ్యం మండలంలోని బిక్కావాండ్లపల్లెలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుపండువ గా వైభవంగా నిర్వహించారు. గురువారం టీటీడీ ఆర్థిక సహాయం, స్థానికుల సహకారంతో సుమారు రూ. 10 లక్షలతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగానే శుక్రవారం ఆలయంలో పూర్ణాహుతి, విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ, కలశ స్థాపన, అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. రాత్రిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు బిక్కావాండ్లపల్లెతో పాటురెడ్డివారిపల్లె, పెద్దమండ్యం, మదనపల్లె, గాలివీడు, చిన్నమండ్యం భక్తులు వచ్చి తిలకించారు.

వరసిద్ధి ఆలయ నూతన కమిటీ ఎంపిక

మదనపల్లె అర్బన్, నవంబరు 8:(ఆంధ్రజ్యోతి) స్థానిక పట్టణంలోని నీరుగటువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయ కమిటీని ఎంపిక చేశారు. శుక్రవారం సాయంత్రం నూతన కమిటీ సభ్యులుకు సన్మానం చేశారు. నూతన ఆలయకమిటీ అధ్యక్షుడుగా రామిశెట్టి శివయ్య, గౌరవాధ్యక్షులుగా కాలా సోమశేఖర్, రామిశెట్టి సిద్దులయ్య, కార్యదర్శిగా కుండా రమేష్, ట్రెజరర్‌గా బందగణేష్, ఎన్నుకున్నారు. మూడేళ్ల పాత కమిటీకి వీడ్కోలు చెప్పి నూతన కమిటీ సభ్యులను ప్రమాణం చేయించారు.

ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలి

పీలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని పీలేరు పట్టణంలోని రోడ్డు పక్కనున్న దుకాణదారులకు అర్బన్ సీఐ యుగంధర్ సూచించారు. పీలేరు పట్టణంలోని కడప రోడ్డు, తిరుపతి రోడ్డు, చిత్తూరు రోడ్డు మార్గాల్లోని ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఆయన పర్యటించి దుకాణదారులతో మాట్లాడుతూ రోడ్డు పక్కనున్న హోటళ్లు, దుకాణాల కారణంగా నాలుగు రోడ్ల కూడలిలో తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. దుకాణాలు, హోటళ్లకు వచ్చే వారు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డు మీదనే పార్కింగ్ చేసుకుంటున్న కారణంగా వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ అంశాలను గమనించి హోటళ్లు, దుకాణాల యజమానులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణ, లోకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫసల్‌బీమాపై అవగాహన కల్పించండి

పులివెందుల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతుసేవా కేంద్రం సహాయకులు రైతులకు అవగాహన కల్పించి.. సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాక అధికారి నాగేశ్వర్‌రావు సూచిం చారు. పులివెందుల పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పులివెందుల వ్యవసాయ డివిజను పరిధిలోని రైతుసేవా కేంద్రం సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రబీ పంటలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 8 పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలుకు గుర్తించామన్నారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ, శెనగ, నువ్వులు, పెసలు, జొన్న, ప్రొద్దుతిరుగుడు పంటలకు డిసెంబరు 15లోపు బీమా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారులు రమేశ్, నాగలక్ష్మి, చెన్నరెడ్డి, నవంత్‌బాబు, రాజేంద్రప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సభను జయప్రదం చేయండి

- ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఈ నెల 14వతేదీన జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు పిలుపు నిచ్చారు. ములకలచెరువులో శుక్రవారం నియోజకవర్గ అధ్యక్షులు ప్రతాప్‌కుమార్, తిరుపాల్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు సుధాకర్, మండల అధ్యక్షుడు క్రిష్టప్ప, నాయకులు విజయ్‌కుమార్, తోపు రమణ, నరసింహులు, శ్రీరాములు, ముత్యాల రమణ, అంజి, సిద్దమల్లు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: మదనపల్లెలో ఈ నెల 14వ తేదిన జరిగే మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ కోరారు. శుక్రవారం ఆయన కలకడలో మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ మాదిగతో కలిసి మాట్లాడుతూ రాయలసీమ జిల్లా పర్యటనలో భాగంగా కార్యక్రమానికి మహా జననేత మందకృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు. సదస్సుకు మాదిగలు తరలిరావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కేసీపల్లె విద్యార్థిని

రామసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలోని కేసీపల్లె హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న హర్షిణి అండర్-14 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిందని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దామోధరం తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వాలీబాల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీ లు ఈనెల 9 నుంచి 11 వరకు విజయనగరంలో జరుగనున్నట్లు ఆయన తెలిపారు.

మదనపల్లె, ములకలచెరువు సీఐల బదిలీ

మదనపల్లె, ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె, ములకలచెరువు సీఐలను బదిలీ చేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న చాన్‌బాషాను అన్నమయ్య జిల్లా వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో నంద్యాల సీఐగా పనిచేస్తున్న ఎరిసావలిని ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లా డీసీఆర్‌బీలో పనిచేస్తున్న మోహన్‌కుమార్‌ను మదనపల్లె ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. ములకలచెరువు సీఐ రాజారమేష్‌ను అన్నమయ్య జిల్లా ఎస్‌బీకి బదిలీ చేశారు. చిత్తూరు ఉమెన్ పీఎస్‌లో పనిచేస్తున్న లక్ష్మన్నను ములకలచెరువు సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశయం సరే.. ఆచరణేదీ?


సీటీఎం రోడ్డులో నేలకూల్చిన చింతచెట్టు (ఫైల్)

- చెట్ల తొలగింపుపై భిన్నాభిప్రాయాలు
- నిబంధనలు పాటించని ఆర్అండ్బీ, అటవీశాఖలు
- పార్కింగ్ కోల్పోయామంటూ వ్యాపారుల ఆందోళన

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టడం మంచిదే. అయితే అదే రోడ్డులో 26 చింత చెట్లు కూల్చేసి వాల్టా చట్టం నిబంధనలు పాటించకుండా ఇష్టమొచ్చిన రీతిలో భారీ వృక్షాలు, కలప వేలం వేయకుండా, అనుమతులు లేకుండా పక్క రాష్ట్రాలకు రవాణా చేయడం ఏంటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో సుమారు రూ.15.60 లక్షల వరకు ఆర్అండ్బీ శాఖ నష్టపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. మదనపల్లె పట్టణంలో నిత్యం వాహనాలు పెరిగిపోవడంతో గాంధీరోడ్డు, చిత్తూరు బస్టాండు, అవెన్యూరోడ్డు, బర్మావీధి, సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతూనే ఉంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన సీటీఎం రోడ్డులోని 26 చింతచెట్లను తొలగించి, రోడ్డును విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా గత ఆదివారం నుంచి భారీ క్రేన్లు, ప్రొక్లైనర్లు, రంపం మిషన్లతో కూడిన మూడు బృందాలను కర్ణాటక నుంచి తెప్పించి సీటీఎం రోడ్డులోని జీఆర్‌టీ షోరూమ్ నుంచి ఏఎస్ఆర్ థియేటర్, స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు, నాగలరాళ్లు, టౌన్‌బ్యాంకు సర్కిల్‌వరకు వున్న 26 భారీ చింత చెట్లను నేల కూల్చి, కలపను అక్కడి నుంచే లారీలలో కర్ణాటకకు తరలించేశారు. దీని వలన 20 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు 60 అడుగులకు విస్తరించింది. ప్రతిరోజు ఎమ్మెల్యే దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కాగా సీటీఎం రోడ్డులో హిందువులు పూజిస్తున్న నాగలరాళ్ల వద్ద వున్న రచ్చబండ రావి చెట్టును మాత్రం అలాగే ఉంచి వారి మనోభావాలు దెబ్బతీయకుండా ఉంచడం గమనార్హం.

అన్నీ తెలిసి కూడా అతిక్రమణలు ...

రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్అండ్బీకి చెందిన 26 చింత చెట్లు, ఒక రావి చెట్టు తొలగించేందుకు 2022లో అప్పటి చిత్తూరు వెస్ట్ డీఎఫ్‌వో ఎస్.రవిశంకర్ అనుమతులు జారీ చేశారు. 2022 ఏప్రిల్ 18వ తేదీ మదనపల్లె ఆర్అండ్బీ ఈఈ లేఖ ఆధారంగా 100 ఏళ్లకు పైగా వయసున్న ఈ చింత చెట్లు ఎప్పటికైనా నేలకూలుతాయని, వాటిని తొలగించేందుకు కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఆర్అండ్బీ ఈఈ లేఖ రాశారు. దీంతో చిత్తూరు వెస్ట్ డీఎఫ్‌వో వాల్టా చట్ట ప్రకారం రూ.2,600 వాల్టా చార్జెస్, రూ.500 యూజర్ చార్జీలు చెల్లించాక, పెంచుపాడు అటవీబీట్ పరిధిలోని ఈ 26 చెట్లను తొలగించేందుకు అటవీశాఖ అనుమతులు జారీ చేసింది. అంతేకాకుండా కొన్ని నిబంధనలు జారీ చేసింది.

- వాల్టా చట్టప్రకారం కూల్చేస్తున్న 26 చెట్లకు బదులు 56 మొక్కలను 30 రోజుల్లో పట్టణంలో నాటడంతో పాటు, వాటిని తప్పనిసరిగా సంరక్షించాలి.
- ఎరుపురంగు గుర్తులు వేశాకే, చెట్లను కూల్చాలి
- అవసరమైన చోట్ల మాత్రమే చెట్లు కూల్చాలి, రోడ్డుకు అడ్డంగా లేని చెట్ల కొమ్మలను మాత్రమే కత్తిరించాలి.
- ఎంత వీలుండే అంత వరకే చెట్లను తొలగించాలి, అనవసరంగా పచ్చదనాన్ని నాశనం చేయడం తగదు.
- ముఖ్యంగా నేలకూల్చిన చింతచెట్ల కొమ్మలు, కలపను ఆర్అండ్బీ ఈఈ ఆధ్వర్యంలో బహిరంగ ప్రకటన ఇచ్చి, వేలం నిర్వహించాక మాత్రమే కలపను ఇతర ప్రదేశాలకు తరలించాలి.
- వేలంలో కలపను కొనుగోలు చేసిన వ్యక్తులు ఫారం-2 ద్వారా అటవీశాఖ నుంచి రవాణా అనుమతి తీసుకున్న తరువాతే రవాణా చేయాలి.


చింతచెట్లు కూల్చాక విస్తారంగా కనిపిస్తున్న సీటీఎం రోడ్డు

నిబంధనలు అతిక్రమించారిలా...

చింతచెట్లను తొలగించడంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం తరువాత చర్యలు తీసుకోలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. సీటీఎం రోడ్డులో ఇప్పటికే అనుమతి ఇచ్చిన 26 చెట్లను తొలగించారు. వాస్తవంగా నరికివేసిన చెట్ల కొమ్మలు, కలపను ఆర్అండ్బీ అధికారులు ఒకచోట చేర్చి, బహిరంగ ప్రకటన చేశాక, ఒక రోజు అందరి సమక్షంలో వేలం వేయాల్సి ఉంది. కానీ అవేమి జరగకుండానే అప్పటికప్పుడే లారీలకు ఎక్కించి కర్ణాటకకు తరలించేశారు. ఒక్కో చెట్టు ఎంత లేదన్నా 20 టన్నుల చొప్పున కలప మొత్తం 520 టన్నులు ఉంటుంది. చింత కలప టన్ను మార్కెట్‌లో రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ఈ క్రమంలో 520 టన్నుల కలప సుమారు రూ.15.60 లక్షలు విలువ చేస్తుంది. ఈ రెండు అంశాలే కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ విమర్శలను ఎక్కుపెట్టారు.

చెట్ల తొలగింపునకు భారీగా ఖర్చు

సీటీఎం రోడ్డులోని చింతచెట్లను చాకచక్యంగా తొలగించడానికి నిర్వాహకులు భారీగా ఖర్చు పెట్టినట్లు తెలిసింది. ఒక్కో చెట్టు కూల్చడానికి రూ.50 వేల వరకు కూలీలకు చెల్లించినట్లు తెలిసింది. ఈ క్రమంలో 26 చెట్లను తొలగించి, వాటి గుంతలు పడిన రోడ్డును అప్పటికప్పుడే మట్టితోలి చదును చేశారు. ఈ పనులన్నింటికి అయిన ఖర్చు చూస్తే కలప అమ్మగా వచ్చిన సొమ్ము కన్నా, ఎక్కువ ఖర్చు వచ్చినట్లు ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు. అదీ కాక ఆర్అండ్బీ అధికారుల ఖాతాకు నిబంధనల ప్రకారం రూ.2 లక్షల దాకా జమ చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. దీనిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేసినప్పుడు రాజకీయ విమర్శలు, గిట్టని వారు చేసే ప్రచారాలను తాను పట్టించుకోనన్నారు.

వ్యాపారుల ఆందోళన

గతంలో సీటీఎం రోడ్డులోని చింతచెట్ల కింద ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అవకాశం ఉండేదని, ఇప్పుడు చెట్లను తొలగించి రోడ్డును విస్తరించారు. 60 అడుగుల వెడల్పులో ఉన్న స్థలంలో డబుల్ రోడ్డు వేస్తే ఇరువైపులా తమ దుకాణాలకు వచ్చే కస్టమర్లు వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలంటూ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దుకాణాల యజమానులు, పట్టణ ప్రముఖులు, మేధావులు, అధికారులు అందరితో ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, అందరికి ఆమోదయోగ్యంగా ఉండే నిర్ణయం తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పట్టణ సుందరీకరణే లక్ష్యంగా పనిచేస్తాం

- సీసీ రోడ్ల భూమిపూజలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెఅర్బన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ సుందరీకరణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ పరిధిలోని 14 వార్డులో స్థానిక ఎమ్మెల్యే ఆ వార్డు ఇన్‌చారి నాగూర్‌వలితో కలిసి శుక్రవారం సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో అన్ని వార్డులో సీసీరోడ్ల నిర్మా ణం చేపట్టి ప్రజలుకు ప్రయాణం సౌకర్యవంతం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటైన కొద్దినెలలోనే మురుగునీటి కాలువులు, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా, మున్సిపల్ కమిష నర్ ప్రమీల, టీడీపీ నాయకులు షంషీర్, బాబ్జీ, రఘుపతినాయుడు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్‌యూఐ శ్రేణులు

పీలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, ఏపీ ఇన్‌ఛార్జ్ రాజీవ్ గాంధీ పిలుపునిచ్చారు. ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం పీలేరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి తాగి ఇటీవల పీలేరులో ఇద్దరు యువకులు మరణించడం అందరినీ కలిచివేసిందన్నారు. యువతను చైతన్యవంతుల్ని చేయాలన్న సంకల్పంతో ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టిన ట్లు తెలిపారు. ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ మాట్లాడుతూ ఇకపై మాదకద్రవ్యాల కారణంగా ఏ ఒక్కరూ బలికాకూడదన్న లక్ష్యంతో తొలుతగా పీలేరులో ప్రచార కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా చేపడతా మన్నారు. అనంతరం స్థానిక ఏవీఆర్ పాఠశాలలోని విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించి వాటికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు సాయిసంపత్, నరేశ్, అఖిల్, ఢిల్లీ బాబు, శివ, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మురుగు కాలువలలో అబెట్ మందును పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దతిప్పసముద్రం నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసన కర్రవాండ్లపల్లెలో స్థానిక ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలని దోమలు కుట్టకుండా ప్రజలు దోమతెరలను వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు అనంతరం విసనకర్ర వాండ్లపల్లెలోని మురుగు కాలువలలో అబెట్ మందును వైద్య సిబ్బంది పిచికారి చేశారు. కార్యక్ర మంలో ఏఎన్ఎం రాధమ్మతో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయండి

కలకడ, నవంబరు 7(ఆంధ్ర జ్యోతి):మండలం లో హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు మంజూ రైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చే యాలని ఎం పీడీవో అబ్దుల్ రహీం కోరారు. శుక్రవారం ఆయన కోన, బాలయ్యగారిపల్లె, కలకడ పంచా యతీలలో లే అవుట్‌లను పరిశీ లించారు. ఈసందర్భంగా లబ్దిదారులతో మా ట్లాడుతూ గతంలో కేటాయించబడ్డ ఇళ్లకు అప్పటి పథకంలో నిర్ణయించబడిన మేరకే బిల్లు లు చెల్లిస్తుందన్నారు. అయితే బిల్లులు మంజూరై రెండేళ్లు కావస్తున్న కొన్ని నిర్మాణాలు అసంతృప్తిగా ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. లబ్దిదారులు నిర్ణీత సమయంలోగా నిర్మా ణాలు పూర్తి చేయకుంటే అర్హులైన ఇతరులకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, పీఆర్ ఏఈలు నాగమునినాయక్, రూప్‌సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత సంతాన సాఫల్య వైద్యశిబిరం

మదనపల్లె టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో శని, ఆదివారాల్లో పిల్లలు లేని దంపతులకు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సాయిసంహిత మోటూరి పేర్కొన్నారు. శుక్రవారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ చెన్నైకు చెందిన ప్రశాంత్ ఫెర్టిలిటి రీసెర్చ్ సెంటర్, మదనపల్లెకు చెందిన మారుతి హెల్త్‌హోమ్ సంయుక్తంగా ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సంతానం లేని దంపతుల కు రూ.10వేలు విలువ చేసే వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు

కురబలకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలు కావాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు సూచించారు. అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగ డానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. దీని కోసం సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047, పీఎం మో దీ వికసిత్ భారత్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఇంటర్న్‌షిప్ చేయడంతో మంచి ఉద్యో గావకాశాలను సాధించవచ్చన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంత రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైర్మన్ ఎన్.ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్, కో- ఆర్డినే టర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై సమాచారం ఇవ్వండి

నిమ్మనపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ధనంజేయులు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో వాగులు, వంకలు పొరంబోకు స్థలాలను ఎవరైనా ఆక్రమించి ఉంటే రెవెన్యూ సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. నిమ్మనపల్లి పంచాయతి బోడిబండ సమీపంలో గల సర్వేనెంబరు.767లో 4.72సెంట్ల వంక పొరంబోకు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తే రామకృష్ణారెడ్డి అనే వ్యక్తిఫిర్యాదుతో బయపడినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

గ్యాస్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోండి

కురబలకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తహశీల్దార్ తపస్విని, సీఎస్‌డీటీ ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాయంలో గ్యాస్ పంపిణీ సిబ్బందితో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపం-2, ఉచితసిలిండర్ల పథకానికి అర్హతకు సంబంధించి ఎంతో ముఖ్యమన్నారు. దానికోసం గ్యాస్ ఏజన్సీ లేదా వారి సిబ్బంది వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

పట్టపగలే రెండు ఇళ్లల్లో చోరీలు

పెద్దమండ్యం నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలే రెండు ఇళ్లల్లో చోరీలు జరిగిన సంఘటన పెద్దమండ్యం మండలంలో చోటు చేసుకుంది. పెద్దమండ్యం పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లె గ్రామ పంచాయతీ తుస్సావారిపల్లె లోని రాములమ్మ, కొండ్రెడ్డి ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇళ్లల్లో నగదు, బంగారు చోరీకి గురైనట్లు బాదితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పీవీ రమణ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 30 మందికి ఉద్యోగాలు


క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన ఫస్టసోర్స్ కంపెని ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా అందులో ప్రతిభ చూపిన 30 మందిని అసోసియేట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. వారికి వార్షిక వేతనంగా రూ.3లక్షలు అందిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, వైస్‌ప్రిన్సి పాల్ బి.కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుం దని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం ఒక ప్రకటనలో తెలిపా రు. పట్టణంలోని 132/33కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనులు చేస్తున్నందున ఉదయం 9గంటల నుంచి పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. విద్యుత్ లైన్లపై చెట్ల తొలగింపు, లైన్ల పునరుద్దరణ, సబ్ స్టేషన్ల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

జగనన్న లే అవుట్ ల పరిశీలన

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


కురవోనికుంట లేఅవుట్ ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శివయ్య

బి.కొత్తకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జగనన్నతో...జనం కడగండ్లు శీర్షికతో శక్రవారం ఆంధ్రజ్యోతి లో వెలువడిన హౌసింగ్ లేఅవుట్ ల కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఉదయమే కథనాన్ని చూసిన కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెంటనే బి.కొత్తకోటకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి నివేదిక ఇవ్వాలని, జిల్లా హౌసింగ్ పీడీ శివయ్యను ఆదేశించారు. దీంతో ఆయన హుటాహుటిన బి.కొత్తకోటకు చేరుకొని నగరపంచాయతీ పరిధిలోని కుర వోనివంక, బద్దిపల్లె లేఅవుట్ లను పరిశీలించారు. రెండు చోట్లా లబ్ధిదారులతో మాట్లాడి ఆంధ్రజ్యోతిలో ప్రస్తావించిన సమస్యలు నిజమేనని గుర్తించారు.కురవోనివంక లేఅవుట్‌లో నీటికొరత నిర్మూలన కోసం రూ.2.50లక్షలతో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని, వర్షపు నీటినిల్వను నివారించేందుకు డబ్ల్యుబీయం రోడ్డు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని నగరపంచాయతీ కమిషనర్ పల్లవి, ఎంపీడీవో శంకరయ్యలను పీడీ సూచించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాల్లాడుతూ జిల్లాలో 330 లేఅవుట్‌లు ఉండగా, 500 లకు పైగా ప్లాట్లు కలిగిన పెద్దలేఅవుట్‌లు 12 ఉన్నాయన్నారు. వాటిలో సమస్యల పరిష్కరానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. హౌసింగ్ అధికారులకు మొదటి విడతలో 2954 ఇళ్లనిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించగా 2364 ఇళ్లను పూర్తిచేశామన్నారు. అదే విధంగా రెండవ ఫేస్‌లో 7374 ఇళ్లను సెప్టెంబరు 23నుంచి డిసెంబరులోగా పూర్తి చేయాలని గడువు విధించారన్నారు. ప్రస్తుతం జిల్లా హౌసింగ్ శాఖలో రూ.400 కోట్ల నిధులు సిద్ధంగా వున్నాయని, పూర్తి అయిన పనికి బిల్లు పెట్టిన మూడురోజులలో నగదు జమ అవుతుందని ఎండీ స్పష్టం చేశారు. ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టకుండా ఉన్నవారిపై తగు చర్యలు తీసుకొని, నిజంగా ఇల్లు అవసరమున్న వారికి కేటాచిస్తే నిర్మాణాలు వేగవంతం అవుతాయని, ఈ దిశగా చర్యలు తీసుకుంటామని ఎండీ పేర్కొన్నారు. డీఈ వెంకటరెడ్డి, ఏఈ లావణ్య పాల్గొన్నారు